తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 11
పేజీలు : 8
వెల : 4
మల్కాజిగిరి
ఆదివారం, 23-07-2023

విలేకర్లు కావలెను
జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

2 నాందేడ్ నుంచి కేసీఆర్..


6 కిషన్ రెడ్డి నియామకంతో సమస్యలు


7 పొంగులేటి ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరికలు




## టెర్రర్ ముఠాలకు సైబర్ చీటింగ్ డబ్బులు

**జయభేరి, హైదరాబాద్ :**
అతి పెద్ద సైబర్ క్రైమ్ ఫ్రాడ్‌ను హైదరాబాద్ పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఉగ్రవాదులు మన వేలుతో మనకన్నునే పొడుస్తున్నారు.. ! మన డబ్బును దోచుకుని మనపైనే దాడులకు పెట్టుబడిగా వాడుకుంటున్నారు. ఇలాంటి ఓ ఉగ్రకోణమే సైబరాబాద్ పోలీసులు బయటపెట్టారు. పెట్టుబడుల పేరుతో మోసమే కాదు.. అంతకుమించిన ఉగ్ర కోణం వెలుగులోకి వచ్చింది. రూ. 712 కోట్ల స్కామ్‌తో పాటు భారీ ఉగ్ర కుట్ర భగ్నమైంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ ఉగ్ర కోణం ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేసింది.ముందుగా మీకో మెయిల్ వస్తుంది. అందులో ఓ టాస్క్ ఉంటుంది. అది పూర్తి చేస్తే అంతకంతా లాభం. కానీ.. ఆ టాస్క్ పూర్తి చెయ్యాలంటే ముందుగా మనమే పెట్టుబడి పెట్టాలి. మొదట పదివేలు పెడతాం. వాళ్లు కూడా నిజంగానే లాభం చూపిస్తారు. ఈసారి పదిలక్షలు పెడతాం. అంతా స్వాహా. ఇలా దేశంలో 15వేల మంది మోసపోయారు. వాళ్లలో ఇప్పటికే లక్షలు సంపాదిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కూడా ఉన్నారు. సోషల్ మీడియాను అడ్డాగా చేసుకొని వందల కోట్లు దోచేస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా 15 వేల మంది వీరి బారిన పడి లక్షల్లో నష్టపోయారు. మరికొందర్ని మోసం చేసే లోపు వీళ్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ మధ్య కాలంలో చేస్తున్న పనితోపాటు అదనపు ఇన్‌కం కోసం చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారు. పెరిగిపోతున్న ఖర్చులు కావచ్చు ఇంకా సంపాదించాలన్న ఆలోచన కావచ్చు కానీ ఇలాంటి వాళ్లే ఈ సైబర్ కేటుగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. ఇలాంటి ఆలోచనలు ఉన్న వాళ్లే ఈ సైబరాసూరులకు ఆహారంగా మారుతున్నారు. మొదట్లో ఆన్‌లైన్‌లో టాస్క్‌ల పేరుతో ఈ సైబర్ నేరగాళ్లు కొన్ని లింక్‌లు పంపిస్తారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వీళ్ల నేరాలకు అడ్డాగా మారుతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా తమ మోసాలను స్టార్ట్ చేస్తారు. టాస్క్ ఓరియెంటెడ్ జాబ్స్ అని చెప్పి మొదలు పెడతారు. అందర్నీ నమ్మించేందుకు మొదట్లో చిన్న చిన్న అమౌంట్లు వేస్తారు. నమ్మకాన్ని కలిగిస్తారు. అక్కడే నేరగాళ్లు తమ ట్రిక్‌ను ఉపయోగిస్తారు. టాక్స్ ఇష్యూ రాకుండా ఉండేందుకని చెప్పి డమ్మీ అకౌంట్ ఓపెన్ చేస్తారు. అలా చేస్తే ట్యాక్స్ తక్కువ పడుతుందని కలరింగ్ ఇస్తారు. చేస్తున్న పనికి మరింత డబ్బులు రావాలంటే కొంత అమౌంట్ పే చేయాలని కూడా చెప్తారు. అలా దాని కొంత అమౌంట్ తీసుకుంటారు. చేస్తున్న పనికి వచ్చే డబ్బులను వాళ్లు క్రియేట్ చేసన డమ్మి అకౌంట్‌లో జమ చేస్తున్నట్టు కట్టు కథలు చెప్తారు. ఆ అకౌంట్‌లో ఉన్న అమౌంట్‌ని కూడా చూపిస్తారు. ఆ అమౌంట్ డ్రా చేసుకోవాలంటే మాత్రం కొంత ట్యాక్స్ కట్టాలనో ఇంకొకటనో చెప్తారు. ఇలాంటి వీళ్ల మాయమాటలు నమ్మి దేశవ్యాప్తంగా 15 వేల మంది బాధితులు 712 కోట్లు పోగొట్టుకున్నారు. అమాయకులే కాకుండా హై లెవెల్ పొజిషన్‌లో ఉన్న ఐటీ ఎంప్లాయిస్ కూడా వీరి బాధితులే. వీళ్లంతా చైనా దుబాయ్ కేంద్రంగా మోసాలు చేస్తున్నారు. అక్కడి నుంచి ఆపరేట్ చేసే

మిగతా 2 లో

# కిరణ్ వల్లే నేను బయటకు వచ్చేశా

**జయభేరి, హైదరాబాద్ :**
తెలంగాణ బీజేపీ కీలక నేత విజయశాంతి కిషన్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం నుంచి మధ్యలో వెళ్లిపోయారు. కనీసం మాట్లాడలేదు. ఆమెను ఎవరూ పట్టించుకోలేదన్న ఆగ్రహంతో వెళ్లిపోయారన్న ప్రచారం జరిగింది. కానీ విజయశాంతి తర్వాత సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. తెలంగాణ వ్యతిరేకులు, తెలంగాణ ఉద్యమాన్ని అణిచి వేసిన వారు ఉండటాన్ని జీర్ణించుకోలేకపోయానని.. అలాంటి వేదికపై ఉండలేకపోయానని ఆమె చెప్పుకొచ్చారు. నేరుగా పేరు చెప్పలేదు కానీ.. ఆమె మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డిని టార్గెట్ చేశారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఇటీవల బీజేపీలో చేరారు. ఆయనను బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా నియమించారు. ఆయన అదే హోదాలో కిషన్ రెడ్డి ప్రమాణానికి వచ్చారు. మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లేనని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్తున్నారని అన్నారు. తమకు కుటుంబ పాలన వద్దని తెలంగాణ ప్రజలు అంటున్నారని తెలిపారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని కిరణ్ కుమార్ రెడ్డి ధీమా

మిగతా 2 లో





## కోటీ 80లక్షలు సంపాదించిన రైతు

**జయభేరి, మెదక్ :**
టమాటా ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నప్పటికీ కొందరు రైతుల మోహాల్లో మాత్రం ఆనందం వెల్లివిరుస్తోంది. ఎక్కడెక్కడో రైతులు కోట్లు సంపాదించారని చాలా వార్తలు వచ్చాయి. ఇప్పుడు మాత్రం తెలుగు రైతే ఇప్పుడు వార్తల్లో నిలిచాడు. మెదక్‌లోని కౌడిపల్లి గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి జూన్ 15 నుంచి నెల రోజుల పాటు టమాటాలు అమ్మి కోటీ 80 లక్షలు సంపాదించారు. చదువు అబ్బకపోవడంతో ఆయన రైతుగా సెటిల్ అయ్యారు. చదువును పదోతరగతిలోనే అపేశారు. మొదట్లో వరి సాగు చేసే మహిపాల్ అందులో నష్టాలనే చూశారు. వరి సాగుతో లాభం లేదని గ్రహించి కూరగాయలు సాగు వైపు మొగ్గు చూపారు. ఇన్నాళ్లు పడిన శ్రమకు ఇప్పుడు ఫలితం లభించింది. నెల రోజులుగా పెరిగిపోతున్న టమాలా ధర కారణంగా మహిపాల్ పంట పండింది. దాదాపు 150 రూపాయలు పలుకుతున్న టమాటను విక్రయించి

మిగతా 2 లో

Jayabheridaily.com
ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
9391 544 889
call me



## అమెరికాలో ప్రభాస్ భారీ ర్యాలీ


2 లో



2 లో

## ఆగస్ట్ మొదటి వారంలో ప్రిలిమ్స్

jayabheridaily.com
ప్రభాత జయభేరి

మొదటిపేజీ తరువాయి

## కిరణ్ వల్లే నేను బయిటకు వచ్చేశా

వ్యక్తం చేశారు. ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని అన్నారు. కారు తాళాలు మనం తీసుకోవాలన్నారు. కారు స్టీరింగ్ తమ దగ్గర ఉందని పతంగి పార్టీ వాళ్లు అంటుంటారు.. తాళాలు తీసుకుంటే కారు ముందుకు వెళ్లదు అని వ్యాఖ్యానించారు. కిరణ్ రెడ్డి ప్రసంగం చాలా మంది బీజేపీ నేతలకు అసౌక ర్యంగానే అనిపించింది. తెలంగాణ విషయంలో కిరణ్ కుమార్ రెడ్డి కి పాజిటివ్ ఇమేజ్ లేదు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అసెంబ్లీలో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వబోనంటూ ఆయన చేసిన ప్రసంగం ఇప్పటికీ సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నేతలు వైరల్ చేస్తూంటారు. ఇక ఆయన పక్కా సమైక్య వాది. జై సమైక్యాంధ్ర పేరుతో పార్టీ పెట్టుకున్నారు. రాష్ట్ర విభజన జరిగితే తెలంగాణలో చీకట్లలో మగ్గిపోతుందని వ్యాఖ్యలు చేశారు. అందుకే..బీజేపీ నేతలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. అయితే విజయశాంతి నేరుగానే తన అసంతృప్తిని బయట పెట్టడం ద్వారా.. కారణం కోసం చూసుకుంటున్న చాలా మంది బీజేపీ నేతలకు దారి చూపించారన్న అభిప్రాయం వినిపిస్తోంది. విజయ శాంతి తాను కార్యక్రమంలో పాల్గొనలేకపోవడానికి కారణం కిరణ్ కుమార్ రెడ్డేనని చెప్పకనే చెప్పారు. అయితే ఆ కిరణ్ కుమార్ రెడ్డిని జాతయ నాయకత్వం ప్రత్యేకంగా ఆహ్వానించి పార్టీలో చేర్చుకుంది. జాతీయ కార్యవర్గ భేటీలో చోటు కల్పించింది. అలాంటి నేతను వ్యతిరేకించడం అంటే.. హైకమాండ్ ను ధిక్కరించినట్లే. విజయశాంతి వ్యూహాత్మకంగా చేశారా లేకపోతే.. అనుకోకుండా చేశారా అన్నదానిపై స్పష్టత లేదు కానీ బీజేపీపై ఇతర పార్టీలు ఎటాక్ చేయడానికి ఓ అవకాశంలాగా మారుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## కోటీ 80లక్షలు సంపాదించిన రైతు

మంచి లాభాలను తెచుకున్నారు. మహిపాల్ సుమారు 8 ఎకరాల్లో టమాటా పంట పండించారు. జూన్ 15 నుంచి వచ్చిన దిగుబడిని అమ్ముతున్నారు. నెల రోజుల్లో కోటీ ఎనభై లక్షల రూపాయల సరకు అమ్మారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేస్తూ భూసారానికి అనుగుణంగా పంట మార్పిడీ చేస్తున్నట్టు మహిపాల్ తెలిపారు. అందుకే తన పొలంలో పండిన టమాట ఏ గ్రేడ్ రకానికి చెందిందని చెబుతున్నారు. అధిక వర్షాలకు కాస్త పంట నష్టం వాటిల్లిందన్నారు. అయితే ఇప్పటి వరకు 60 శాతం పంటనే అమ్మానని.. ఇంకా 40 శాతం పంట పొలంలోనే ఉందన్నారు. మిగతా 40 శాతం దిగుబడి అమ్మితే కచ్చితంగా తన ఆదాయం 2 కోట్లకు దాటిపోతుందన్నారు. మహిపాల్ రెడ్డి వద్ద దాదాపు వంద ఎకరాల భూమి ఉంది. నాలుగేళ్ల నుంచి 40పైగా ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. మిగిలిన వాటిలో వరి లాంటి పంటలు వేస్తున్నారు. వ్యవసాయంలో కంటిన్యూగా ప్రయత్నిస్తుంటేనే లాభాలు చూడవచ్చని అంటున్నారు. ఎకరాకు రూ. 2 లక్షలు పెట్టుబడి పెడతానని.. సీజన్ బాగుంటే కచ్చితంగా మంచి లాభాలు వస్తాయని పెట్టుబడి ఎటూ పోదని అంటున్నారు మహిపాల్. తాను ఇప్పటి వరకు 7,000 పెట్టెలకు పేగా టమాటాలను విక్రయించినట్టు తెలిపారు. ఒక్కోటి బాక్స్ 25 కిలోల కంటే ఎక్కువగా టమాటాలు ఉంటాయి. ఇప్పుడు వచ్చిన లాభాలతో వ్యవసాయంలో లేటెస్ట్ టెక్నాలజీని వాడుకోవడానికి ఉపయోగపడతాయని అంటున్నారు మహిపాల్. త్వరలోనే వ్యవసాయ పనుల కోసం డ్రోన్స్ వాడబోతున్నట్టు చెప్పారు. ఖర్చులు తగ్గించుకోవడానికి ఇది చాలా ఉపయోగపడుతుందన్నారు.

## టెర్రర్ ముఠాలకు..

కొందరు కేటుగాళ్లు ఇక్కడ తమ ఏజెంట్లను నియమించుకుంటున్నారు. వారి ద్వారా మిగతా కథను నడిపిస్తున్నారు. స్థానిక భాషలు మాట్లాడుతూ నిండా ముంచుతున్నారు. షెల్ కంపెనీలు, బ్యాంక్ అకౌంట్స్ ఓపెన్ చేసి.. వచ్చిన డబ్బును చైనా, దుబాయ్‌కు పంపిస్తున్నారు. అకౌంట్‌స్‌లో ఉన్న మనీని క్రిప్టో కరెన్సీ ద్వారా ట్రాన్స్ఫర్ చేసుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. శివకుమార్ అనే ఓ వ్యక్తి ఇచ్చిన కంప్లెయింట్ ఆధారంగా కేసును దర్యాప్తు చేసిన పోలీసులకు విస్తుపోయే వాస్తవాలు తెలిశాయి. నిందితులకు చెందిన 48 అకౌంట్‌స్‌లో 584 కోట్లు జమయ్యాయి. మరో 128 కోట్లు ఇతర అకౌంట్‌స్‌లో డిపాజిట్ అయ్యాయి. ఫేక్ పేపర్‌స్‌తో లక్నోలో 33 షెల్ అకౌంట్స్, 65 బ్యాంక్ అకౌంట్స్ ఓపెన్ చేశారు కేటుగాళ్లు. ఫ్రాడ్ చేసిన డబ్బును ఈ షెల్ కంపెనీలు, అకౌంట్‌స్‌లో డిపాజిట్ అవుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఫ్రాడ్ చేసిన డబ్బుని క్రిప్టో కరెన్సీగా ట్రాన్స్ఫర్ చేసుకుని దుబాయ్, చైనాలో విత్ డ్రా చేసుకుంటున్నారు. చైనా, దుబాయ్‌లో ఉన్న ప్రధాన నిందితులకు ఇండియాలో కొందరు ఏజెంట్లు సహకరిస్తున్నారు. ఇప్పుడు అలాంటి 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్ చేసిన డబ్బుని క్రిప్టో కరెన్సీకి మార్చి ఆ క్రిప్టో కరెన్సీని హిజ్బుల్లాకి సంబంధించిన టెర్రర్ మాడ్యూల్‌కి ట్రాన్స్ఫర్ అయినట్లు గుర్తించారు. ఇక్కడ ఫ్రాడ్ చేసిన డబ్బును టెర్రరిస్టులకు ఫైనాన్స్ చేసే అవకాశం కూడా ఉంది.



## మాయ మాటలు చెప్పి అత్యాచారం


**జయభేరి, ఒంగోలు :**

మానసిక దివ్యాంగురాలైన ఓ బాలికపై 73 ఏళ్ళ వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడిన దారుణ ఘటన ఏపీలో కలకలం రేపింది.. మనుమరాలి వయస్సున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఆ వృద్ధుడిని ప్రకాశం పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం సిద్దినాయునిపాలెంలో మానసిక దివ్యాంగురాలు (17) తల్లితో కలిసి ఉంటోంది. తన తల్లితో కలిసి సాయంత్రం 5 గంటల సమయంలో సైకిల్‌పై స్థానిక అంగన్వాడీ కేంద్రం దగ్గరకు వెళ్ళింది.. అదే గ్రామానికి చెందిన 73 ఏళ్ళ వృద్ధుడు రుద్రపాటి చిన్న వెంకటచెన్నయ్య ఆమెతో మాటలు కలిపాడు. కుశలప్రశ్నలు వేస్తున్నట్టు నటించి, అనంతరం మాయమాటలు చెప్పి ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు.బాలిక ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి ఆమెను వెతుక్కుంటూ వెళ్ళింది... అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలో ముళ్ళపొదల్లో వెతికింది.. అక్కడ వృద్ధుడి చెరలో ఉన్న బాలిక కన్పించింది. ఆమె కేకలు వేయడంతో స్థానికులు చుట్టుముట్టి వృద్ధుడ్ని పట్టుకునే క్రమంలో తప్పించుకుని పారిపోయాడు. ఈ ఘటనపై బాలిక తల్లి పెద్దారవీడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై పులి రాజేష్ నిందితుడిపై అత్యాచారం, ఫోక్సో సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.దర్యాప్తులో భాగంగా డీఎస్పీ వీర రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం మార్కాపురం అదనపు మొదటి తరగతి ఇన్చార్జి న్యాయమూర్తి ఎమ్.ఎస్ కరీముల్లా ముందు హాజరుపరచగా, నిందితుడికి రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అతడిని మార్కాపురం ఉపకారాగారానికి తరలించారు.

# అమెరికాలో ప్రభాస్ భారీ ర్యాలీ

**జయభేరి, న్యూయార్క్ :**

పాన్ ఇండియా హీరో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ప్రాజెక్ట్ K' సినిమా కోసం ఇండియా వైడ్‌గా ఉన్న సినీ ఆడియన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద రికార్డులు క్రియేట్ చేస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక 'ప్రాజెక్ట్ K' సినిమా టైటిల్ అండ్ గ్లిమ్స్ ని అమెరికాలో శాన్ డియాగో కామిక్ ఖాన్ ఈవెంట్లో రివిల్ చేసిన విషయం తెలిసిందే. ఇందుకోసం ప్రభాస్, కమలహాసన్, నాగ్ అశ్విన్ అమెరికా వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా అమెరికాలోని ప్రభాస్ అభిమానులు డార్లింగ్ కి వినూత్న రీతిలో వెల్కమ్ చెబుతూ వారి అభిమానాన్ని చాటుకున్నారు. జూలై 20వ తేదీన 'ప్రాజెక్ట్ K' మూవీ ప్రతిష్టాత్మకమైన శాన్ డియాగో కామిక్ ఖాన్ ఈవెంట్లో పాల్గొంది.ఈ సందర్భంగా శాన్ డియాగో లోని ప్రభాస్ ఫ్యాన్స్ ఏకంగా కార్ ర్యాలీ నిర్వహించారు. శాన్ డీయాగోలో ఫ్యాన్స్ అంత భారీగా కార్ ర్యాలీ చేపట్టారు. అనంతరం అభిమానులు కార్లను 'ప్రాజెక్ట్ K' అనే పేరు వచ్చేలా లోగో రూపంలో పార్క్ చేస్తూ సందడి చేశారు. అంతేకాకుండా అభిమానులంతా ప్రాజెక్ట్ K ప్రత్యేక టీషర్టులను ధరించి ప్రభాస్ కి గ్రాండ్ వెల్కమ్ చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతుంది. ఇక ఈ వీడియోను చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ శాన్ డీయాగోలోని ప్రభాస్ ఫ్యాన్స్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ప్రభాస్ ఫ్యాన్స్ తో పాటు నెటిజన్స్ ని సైతం ఎంతగానో ఆకట్టుకుంటుంది.మరోవైపు ఇప్పటికే 'ప్రాజెక్ట్ K' మూవీ యూనిట్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ టైటిల్ అండ్ గ్లిమ్స్ వీడియో ఫాన్స్, తో పాటూ ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ ని అందుకుంది. ఇక ప్రాజెక్ట్ K సినిమాకి 'కల్కి 2898 AD'అనే టైటిల్ ని ఫిక్స్ చేశారు. ఇక గ్లిమ్స్ విషయానికొస్తే.. విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్ లు హాలీవుడ్ రేంజ్ లో ఉన్నాయి. ప్రభాస్ ని కల్కి అవతారంలో ఉన్న సూపర్ మ్యాన్ లా చూపించారు. 'ఎప్పుడైతే అంధకారం ప్రపంచాన్ని ఆక్రమిస్తుందో అప్పుడు ఓ శక్తి ఉద్భవిస్తుంది. అంతం అనేది ఇప్పుడు ఆరంభమవుతుంది' అనే డైలాగ్స్ తో సినిమా ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేసారు. అంతేకాకుండా ఇదొక టైం ట్రావెల్ కథ అని గ్లిమ్స్ చూస్తేనే అర్థమవుతుంది.దుష్ట శక్తుల నుండి ప్రపంచాన్ని కాపాడే కల్కి అవతారంలో ప్రభాస్ ని చూపించబోతున్నాడు దర్శకుడు నాగ అశ్విన్. సుమారు రూ.600 కోట్ల భారీ బడ్జెట్ తో వైజయంతి మూవీస్ బానర్ పై సీనియర్ నిర్మాత అశ్వినీదత్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో



నిర్మిస్తున్నారు. ప్రభాస్ కి జోడిగా దీపికా పదుకొనే నటిస్తుండగా.. బాలీవుడ్ లెజెండరీ నటుడు అమితాబచ్చన్, కమలహాసన్, దిశాపటాని కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతమందిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది.

# ఆగస్ట్ మొదటి వారంలో ప్రిలిమ్స్

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు ఆగస్టు మొదటివారంలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఫలితాల విడుదలకు టీఎస్పీఎస్సీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష ప్రాథమిక 'కీ' విడుదల చేయగా.. మరికొద్ది రోజుల్లోనే ఫైనల్ కీ విడుదలచేసి, ఆగస్టు మొదటి వారంలో ఫలితాలను వెల్లడించనున్నారు.ఈ ఏడాది జూన్ 11న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రాథమిక కీని జూన్ 28న విడుదల చేశారు. ప్రాథమిక కీ పై వచ్చిన అభ్యంతరాలను నిపుణుల కమిటీకి టీఎస్పీఎస్సీ పంపింది. ఈ క్రమంలో జులై 23 లేదా 24 తేదీల్లో ఫైనల్ కీని విడుదల చేసే అవకాశం ఉంది. తుది కీని విడుదల చేసిన అనంతరం పరీక్ష రాసిన అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుంది. గ్రూప్1 ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించిన తర్వాత 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను మెయిన్స్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మొత్తంగా 25,150 మందిని టీఎస్‌పీఎస్సీ మెయిన్‌స్‌కు ఎంపిక చేయనుంది.తెలంగాణలో 501 గ్రూప్1 పోస్టుల భర్తీకి జూన్ 11న రాష్ట్రవ్యాప్తంగా 994 పరీక్ష కేంద్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. జూన్ 11న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 61.16 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. గ్రూప్1 పోస్టుల భర్తీకి మొత్తం 3.80 లక్షల మందికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 2,32,457 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రశ్న పత్రం లీకేజీ కారణంగా గతేడాది అక్టోబర్ 16న జరిగిన గ్రూప్1 పరీక్షను రద్దు చేయడంతో మళ్లీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. తెలంగాణలో




503 పోస్టులతో తొలి గ్రూప్1 నోటిఫికేషన్‌ను గతేడాది ఏప్రిల్ 26న టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 3,80,202 మంది దరఖాస్తు చేశారు.

అక్టోబరు 16న ప్రిలిమినరీ నిర్వహించగా 2,85,916 మంది రాశారు. ఇక ప్రిలిమ్స్ కీలో వెలువడిన అభ్యంతరాల నేపథ్యంలో 5 ప్రశ్నలు తొలగించి కమిషన్ తుది కీ ఖరారు చేసింది. పరీక్ష రాసిన వారిలో 1:50 నిష్పత్తిలో 25 వేల మంది అభ్యర్థులను టీఎస్‌పీఎస్సీ మెయిన్‌స్‌కు ఎంపిక చేసింది. వారికి షెడ్యూలు ప్రకారం జూన్‌లో ప్రధాన పరీక్షలు జరగాల్సి ఉంది. ఇంతలోనే ప్రశ్నపత్రాల లీకేజీ కేసు వెలుగుచూడడంతో గ్రూప్1 ప్రాథమిక పరీక్ష రద్దు చేసి మళ్లీ రీషెడ్యూల్ చేసి జూన్ 11న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్1 సర్వీస్ నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఆగస్టు 2 నుంచి 11 వరకు ప్రతిరోజు 30 మంది అభ్యర్థుల చొప్పున, చివరి రోజు మాత్రం 10 మందికి ఇంటర్వ్యూ నిర్వహించనుంది. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను తేదీలవారీగా అందుబాటులోఉంచింది.

విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో రోజుకు రెండు షిఫ్టుల్లో అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించడంతో పాటు ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఎడ్యుకేషన్ సోసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్(ఎన్ఈఎస్‌టీఎస్) దేశవ్యాప్తంగా ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో (ఈఎంఆర్ఎస్) ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా మొత్తం 4062 టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. పోస్టులవారీగా విద్యార్హతలు నిర్ణయించారు. సరైన అర్హతలున్నవారు జులై 31లోగా ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. జాతీయస్థాయి రాతపరీక్ష ద్వారా ఉద్యోగ ఎంపికలు చేపడతారు.



## పిల్లలతో కలిసి మొక్కలు నాటిన హీరోయిన్

**జయభేరి, రాజమండ్రి :**

రాజమండ్రి ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో డివైడర్ల మధ్యలో ఎంపీ భరత్, కామ్నా జెఠ్మలానీలు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నగరంలో చెట్లు నాటే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు హీరోయిన్ కామ్నా.ఉమ్మడి తూర్పుగదావరి జిల్లాలోని ప్రముఖ నగరం రాజమహేంద్రవరంలో సినీ నటి కామ్నా జెఠ్మలానీ సందడి చేసింది. రాజమహేంద్రవరం ఎంపి ఆధ్వర్యం లో జగనన్న హరిత నగరాలు పేరుతో రాజమండ్రి ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నిర్వహించిన యువత హరిత కార్యక్రమంలో కామ్నా జెఠ్మలానీ పాల్గొన్నారు. యువత హరిత కార్యక్రమానికి హాజరైన సినీనటి కామ్నా జెఠ్మలానీ కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థులతో అభివాదం చేశారు.అనంతరం రాజమండ్రి ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో డివైడర్ల మధ్యలో ఎంపీ భరత్, కామ్నా జెఠ్మలానీలు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నగరంలో చెట్లు నాటే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు హీరోయిన్ కామ్నా. గోదావరి అందాలంటే తనకు చాలా ఇష్టం అన్నారు కామ్నా జెఠ్మలానీ. ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ భారత్ కూడా పాల్గొన్నారు. భవిష్యత్తులో కావలసింది ఆక్సిజన్.. మొక్కలు నాటే కార్యక్రమాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు ఎంపీ భరత్.

# బియ్యం ఎగుమతులపై నిషేధం
# అమెరికాలో భారీ డిమాండ్

**జయభేరి, న్యూయార్క్ :**

దేశీయంగా బియ్యం ధరలను అదుపులో పెట్టేందుకు కేంద్రం గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం విధించింది. బాస్మతీయేతర బియ్యాన్ని నిషేధిత ఎగుమతుల జాబితాలోకి చేర్చినట్టు డైరెక్టరరేట్ ఆఫ్ జనరల్ ఫారిన్ ట్రేడ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వస్తాయని ప్రకటించింది.భారత్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ దేశాలను ముఖ్యంగా అమెరికాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అమెరికాలో బియ్యానికి డిమాండ్ భారీగా పెరిగింది. ఎగుమతుల నిషేధంతో అమెరికాలో 20 పౌండ్లు అంటే సుమారు పది కిలోలు బరువు ఉండే రైస్ బ్యాగ్ ధర 18$ డాలర్లు నుంచి ఏకంగా 50$ డాలర్లకు పెరిగింది. అంటే దాదాపు 1500 రూపాయుల ఉండే బ్యాగ్ కాస్ట్ ఇప్పుడు నాలుగు వేలకు పెరిగింది. కిలో నాలుగు వందల రూపాయలు పలుకుతోందన్నమాట.ఒక్కసారిగా బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుకోవడంతో ఎన్ఆర్ఐల్లో ఆందోళన పెరిగింది. బియ్యం బస్తాల కోసం సూపర్ మార్కెట్లకు పరుగులు పెడుతున్నారు. గంటల కొద్ది క్యూలో ఉంటున్నారు. ఎన్ఆర్ఐలను కంట్రోల్ చేయడం స్థానిక సూపర్ మార్కెట్ల సిబ్బందికి తలకు మించిన భారం అవుతోంది. దుకాణాల్లోకి వెళ్లిన వారు సంతలో కూరగాయల కోసం పోటీ పడినట్లు బియ్యం కోసం ఎగబడుతున్న ఎగపడుతున్నారు.

ఇక్కడ ఉన్న వీడియోలను చూస్తే మీకు పరిస్థితి అర్థమవుతుంది. బియ్యం ఎగుమతుల విషయానికి వస్తే దేశీయంగా బియ్యం ధరలు క్రమంగా పెరుగుతున్నాయని ఆహార మంత్రిత్వ శాఖ పేర్కొంది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై 20 శాతం సుంకం విధించింది. దేశీయ అవసరాలకు సరిపడా నిల్వలు రెడీ చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ పరిస్థితులు, వరి పండించే ఇతర దేశాల్లో ప్రతికూల వాతావరణం తదితర కారణాల వల్లే ఎగుమతులు పెరిగాయని ఆహారశాఖ వెల్లడించింది.గత ఏడాది కాలంలో ధరలు 11 శాతం పెరగ్గా, గత నెలలో 3 శాతం మేర పెరిగాయి. వినియోగదారుల మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, భారత్ బియ్యం ఎగుమతుల్లో 40 శాతం వాటా కలిగి ఉంది. 2022లో ఇండియా రికార్డు స్థాయిలో 22.2 మిలియన్



టన్నులను ఎగుమతి చేసింది.ఈ నిషేధంతో థాయ్‌లాండ్, ఇటలీ, స్పెయిన్, శ్రీలంక, అమెరికా, బంగ్లాదేశ్, నేపాల్, బెనిన్, అంగోలా, కామెరూన్, జిబౌటి, గినియా, ఐవరీ కోస్ట్, కెన్యా వంటి అనేక ఆఫ్రికన్ దేశాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ దేశాలు భారత్ నుంచి పెద్ద ఎత్తున బియ్యం కొనుగోలు చేస్తున్నాయి. తాజాగా బియ్యం ఎగుమతులపై భారత్ ఆంక్షలతో ప్రపంచవ్యాప్తంగా ధరలు పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది రుతు పవనాలు ఆలస్యంగా ప్రవేశించాయి. దీంతో దేశంలో చాలా ప్రాంతాల్లో వరినాట్లు ఆలస్యమయ్యాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కురిసిన వర్షాలతో చాలా చోట్ల పంట నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో బియ్యం ధరలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో బియ్యం ఎగుమతులపై నిషేధం విధించాలని కేంద్రం నిర్ణయించింది. దీని ఫలితంగా దేశీయ మార్కెట్‌లో బియ్యం ధరలు కొంత మేర తగ్గుతాయని భావిస్తోంది. మరోవైపు ధరల పెరుగుదల ప్రభావం ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారి తీసుకుందని ప్రభుత్వం భావించింది.

# ఫిర్యాదులను పట్టించుకోని బల్దియా

**జయభేరి, హైదరాబాద్ :**

వర్షాకాలంలో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నెంబర్లు స్పందించకుండాపోయాయి. నగర వాసులు చేస్తున్న వర్షాకాలం ఫిర్యాదులను బల్దియా కంట్రోల్ రూమ్ పట్టించుకోని పరిస్థితి. 040 2111 1111 వందల సంఖ్యలో కాల్స్ వస్తున్నప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పదుల సార్లు కాల్స్ చేసే గాని కంట్రోల్ రూమ్ లిఫ్ట్ చేయట్లేదు అంటూ నగరవాసుల మండిపడుతున్నారు. పది కాల్స్‌లో కేవలం ఒకటి రెండు కాల్స్‌కు మాత్రమే జీహెచ్ఎంసీ స్పందిస్తోంది. బల్దియా కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జ్‌గా ఓ రిటైర్డ్ అధికారి ఉన్నారు. రోజుకు 500 నుంచి 700 వరకు ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. అయితే మాన్సూన్ సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ దాదాపు 24 గంటల సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వెనువెంటనే సమస్యలు పరిష్కరించడంలో జీహెచ్ఎంసీ ఆలస్యం చేస్తుండటం పట్ల నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నిరుపేద ఆడపిల్లల సంక్షేమానికి ది పింక్ సర్కిల్ ఫౌండేషన్ సంస్థ




**జయభేరి, మల్కాజిగిరి :**

నిరుపేద ఆడపిల్లల విద్యా, వైద్యం కోసం ది పింక్ సర్కిల్ ఫౌండేషన్ సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకురాలు సుధ ధబ్రాల్ తెలిపారు. శనివారం సైనికపురి లోని ద పింక్ సర్కిల్ ఫౌండేషన్ సంస్థ నాల్గవ వార్షికోత్సవం వేడుకల కార్యక్రమం వివాహ భోజనంబు బంకేట్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ లో 150 మహిళలు ఉన్నారనీ ,వీరు ప్రతి నెల తమ వంతు విరాళం సంస్థకు అందించడం ద్వారా కొంత నిధిని సమకూర్చుకోవడం జరిగిందన్నారు. అలాంటి నిది ద్వారా మన సమాజంలో ఎంతో మందికి సేవలు అందిస్తున్నామన్నారు. పేద ఆడపిల్లలకు స్కూల్ ,కాలేజీ ఫీజులకు సహాయము , ఆసుపత్రిలో వున్న పేద రోగుల ఖర్చులకు సహాయం మా ఫౌండేషన్ ద్వారా అందిస్తామని చెప్పారు. అనాధ ఆశ్రమాలకు, వృద్ధ ఆశ్రమాలకు నెలసరి సరుకులు కూడా అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ కు ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు చేయాలి



**జయభేరి, కాప్రా:**

ఉప్పల్ నియోజకవర్గానికి ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు చేయాలని డిగ్రీ కళాశాలకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బేతి సుభాష్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ కు ఈ వారం ఒక విన్నతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తో సమావేశమై ఉప్పల్ నియోజకవర్గ సమస్యలు వివరించి ఉప్పల్ నియోజకవర్గానికి , ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు చెయ్యాలని, డిగ్రీ కాలేజీకి స్థలం కేటాయించాలని కోరారు,కాప్ర , చర్లపల్లి రామంతపూర్, చెరువుల వద్ద, చత్ పూజ , సూర్య భగవాన్ పూజ కొరకు ప్రత్యేక కొలనులను ఏర్పాటు చేయాలని , జీవో నెంబర్ 58 ,59 దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు త్వరగా పట్టాల పంపిణీ చేయాలని కోరారు , కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, కాటేపల్లి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మర్యాదలను తిరస్కరించి.. అందరితో పాటే లైన్లో ఇంటర్వ్యూ



**జయభేరి, ఉత్తరాఖండ్ :**

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్ నగరంలొ ఉద్యోగ మేళా జరుగుతుంది. అంతలొ అక్కడికి ఇద్దరు అమ్మాయిలను తీసుకుని ఒక పెద్దయన ఆటొలొ వచ్చారు. అంతే వాళ్లను చూసి అక్కడి అధికారులు, పొలీసులు, ఇతరులకు షాక్ కొట్టినట్టయింది. ఒక్కసారిగా అందరూ బిత్తరపొయి, నొరెళ్లబెట్టారు. ఏందుకంటే అక్కడ జరుగుతున్న ఉద్యోగమేళా కు ఇంటర్వ్యూకు వచ్చిన ఆ ఆడపిల్లలిద్దరూ సాక్ష్యాత్తూ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాధ్ గారి మేనకొడళ్ళయిన లక్ష్మి రావత్, అర్చనా లు. వారిని తీసుకుని వచ్చిన ఆ పెద్దాయన (చేతిలొ కర్ర, టొపి పెట్టుకున్న పెద్దాయన) సాక్ష్యాత్తు యోగి ఆధిత్యనాధ్ తండ్రి గారయిన ఆనంద్ సింగ్ ‐ ‐ ‐. ఆనంద్ సింగ్ గారికి, లక్ష్మిరావత్ _ అర్చనా లు సొంత మనుమరాళ్ళు. ఇక వారిని చూసి ప్రభుత్వ అధికారులు రాచమర్యాదలు చేయడం ప్రారంభించడంతొ, యోగి ఆధిత్యనాధ్ తండ్రి ఆనంద్ సింగ్, వారి మర్యాదలను తిరస్కరించి, తన మనువరాళ్లను అందరితొ పాటే లైన్లొ ఇంటర్వ్యూకు పంపారు. ఈ సంధర్భంగా అక్కడికి వచ్చిన లొకల్ మీడియా తొ ఆనంద్ సింగ్ గారు మట్లాడుతూ " ఇంటర్వ్యూలకు వెళుతూఉంటే, ఇంటర్వ్యూలలొ ఏలా విజయం సాధించాలొ వారే నేర్చుకుంటారని తెలిపారు. ఉద్యోగాలు అనేవి ప్రతిభ ఆధారంగానే రావాలి కాని, సిఫార్సుల ద్వారా కాదని చెప్పారు. ఒక వేళ నా కొడుకు యోగి ఆధిత్య, వీళ్ళ ఉద్యోగాలకు రికమండ్ చేసినా నేను ససేమిరా ఒప్పుకొనని అయన స్పష్టం చేశారు. బహుశా ఇంత గొప్ప ఆదర్శవంతుడైన తండ్రి పెంపకంలొ పెరగడం వలననే యోగి ఆధిత్యనాద్ గారు గొప్ప ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా అందరి ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. బహుశా కారణ జన్ములని ఇలాంటి వారినే అంటారేమొ.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం

## కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి

**జయభేరి, మేడిపల్లి :**



వరద ముంపు ప్రాంతాల ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు గాను చేపట్టిన ఎస్ఎన్డీపీ పనుల జాప్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో చేసిన పోరాటం ఫలితంగానే పనులు పునః ప్రారంభించారని పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. ఈ మేరకు శనివారం నాడు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020లో వచ్చిన అకాల వర్షాల కారణంగా నగరంలోని అనేక కాలనీలు నీట మునిగాయని అప్పుడు లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఅర్, కార్మిక మంత్రి మల్లారెడ్డి లతో స్థానిక మేయర్లు, ప్రజాప్రతినిధులు పర్యటించి ముంపు ప్రాంతాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గాను రూ.110 కోట్లతో జంట కార్పొరేషన్ల పరిధిలో ఎస్ఎన్డీపీ ద్వారా మూసికి అనుసంధానం చేసేలా పనులు ప్రారంభిస్తున్నామని నాడు మంత్రుల అధ్వర్యంలో 2022 ఫిబ్రవరి 2 అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవం చేశారని ప్రారంభించి రెండు సంవత్సరాలు గడుస్తున్న నేటికి పనులు ముందుకు సాగకపోవాడంలో అంతార్యం ఎంటో అర్దం కావాడం లేదని అన్నారు.మంత్రి మాట ఇచ్చిన అనంతరం రెండు వర్షాకాలలు గడిచి పోయాయని కానీ మాత్రం ముందుకు సాగడం లేదని విమర్శించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పీర్జాదిగూడ నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మంత్రి మల్లారెడ్డి కానీ,మేయర్,డిప్యూటీ మేయర్ కనీసం పట్టించుకోలేదని పాలక వర్గం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రతి కాలనీల్లో పర్యటించామని ప్రజా సమస్యలపై పీర్జాదిగూడ కమీషనర్ ను కలిసి వత్తిడి తీసుకురావడం జరిగిందని అనంతరం ఎస్ఎన్డీపీ అధికారులతో మాట్లాడిన అనంతరం పనులు పునః ప్రారంభం చేశారని అది కేవలం కాంగ్రెస్ పోరాట ఫలితమేనని అన్నారు. భవిష్యత్తులో పనులు ప్రారంభం పూర్తి కాకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

# రాష్ట్రపతి పాలనతో పాటు బాధితులకు వెంటనే ఉరిశిక్ష వెయ్యాలి

**జయభేరి, మేడిపల్లి :**



తెలంగాణ రాష్ట్ర మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ (మా) ఆధ్వర్యంలో మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసి మహిళలలపై అదేవిధంగా ఒక భారత దేశ సైనికుని భార్యపై జరిగిన అత్యాచారం,హత్యలను ఖండిస్తూ శనివారం కొత్త పెట్ హుడా కాలనీ మా అడ్వకేట్స్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. దేశ చరిత్రలో అత్యంత పాశవికమైన చర్య మణిపూర్ లో కొండ ప్రాంతాల్లో నివసించే కుకీ తెగకు చెందిన ముగ్గురు ఆదివాసి మహిళలను అత్యంత పాశవికంగా నగ్నంగా ఊరంతా ఊరేగించి, అత్యాచారం చేసి ఆపై ఇద్దరు మహిళలతో పాటు భారత దేశం కోసం భారత సైన్యంలో పనిచేస్తున్న ఒక సైనికుడి భార్యను కూడా అత్యాచారం చేసి,హత్య చేసిన తీవ్రమైన సంఘటన వెలుగులోకి వచ్చింది.ఈ విషయం పట్ల తీవ్ర ద్రిగ్భాంతి వక్తం చేస్తూ.. మా అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము ప్రవీణ్ కుమార్ ఆదేశానుసారం అధ్వర్యంలో మణిపూర్ మహిలల పట్ల అమానుషంగా వ్యవహరించి హత్య చేసిన దుర్మార్గులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా ఉరిశిక్ష వేసి శిక్షించాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మా అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్ము ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకోవాలని, వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజీనామా చేసి గిరిజనుల కుటుంబాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి బాధితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు చేపట్టి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అక్కడ జాతుల మద్య జరిగిన విషయాన్ని మత ఘర్షణగా మార్చాలనుకుంటున్న భారతీయ జనతా పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గుతో తల వంచుకోవాలని డిమాండ్ చేశారు. ఒక ఆభం శుభం తెలియని అమాయక గిరిజనుల పైన పాశవిక అత్యాచారం, హత్య చూస్తుంటే భారతదేశంలో ప్రజాస్వామ్యం కుని అయిందని, ఇది భారతదేశానికి సిగ్గు చేటు అని అన్నారు.

మా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చందులాపురం భూపతి మాట్లాడుతూ వెంటనే జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి త్వరగా విచారణ జరిపి ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఒక అమాయక గిరిజనుల మీద జరిగిన సంఘటనను సుమోటగ తీసుకొని విచారణకు ఆదేశించిన చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా చంద్ర చూడ్ కు ప్రత్యేక జై భీములు తెలియజేశారు. దేశంలో భాజపా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత దేశ పౌరుల ప్రజాస్వామ్యాన్ని కుని చేస్తున్నాయని హెచ్చరించారు.

అదేవిధంగా జాయింట్ సెక్రెటరీ కేరిత్ కుమారి గుర్రంపల్లి మాట్లాడుతూ ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఓ భారతమాత నువ్వు ఎక్కడ.. భారత మహిళలపై ఇంత ఘోరమైన, క్రూరమైన సంఘటన జరుగుతుంటే, అభం శుభం తెలియని అమాయక గిరిజనుల మీద దాడులు, హత్యలు, మానభంగాలు జరుగుతుంటే కళ్ళు మూసుకొని చూస్తున్నావా.. ఈ భారతదేశంలో దళిత గిరిజనులకు అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం రైట్స్ వర్తించవా, ఎందుకింత ఘోరమైన, క్రూరమైన చర్యలు జరుగుతున్నాయని ప్రశ్నించారు. భారతదేశన్ని పరిపాలిస్తున్న భాజాపా ప్రధానమంత్రి, మణిపూర్ పరిపాలిస్తున్న భాజపా రాష్ట్ర ముఖ్యమంత్రులు లేరా, వారికి ఆడపిల్లలు లేరా అని ప్రశ్నించారు.

కాబట్టి వెంటనే విచారణ జరిపి ఉరిశిక్ష విధించాలని, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని భారత దేశ రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పోలే విష్ణు, అడ్వకేట్స్ నాయకులు కొమురయ్య, అశోక్, సురేష్, సైదులు, వికాస్, విజయ్, సుబ్బన్న, మహిళా అడ్వకేట్స్ సుమతి, ప్రియాంక, పద్మావతి తదితరులు హాజరయ్యారు.

# ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

## బోనాలకు వచ్చే భక్తులకు ఆలయాల వద్ద అన్నిరకాల ఏర్పాట్లు



**జయభేరి, ఉప్పల్ :**

చిల్కానగర్ డివిజన్ లో బోనాల పండుగను పురస్కరించుకొని శ్రీ పోచమ్మ, ఆలయాల వద్ద అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పోచమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఏర్పాటు చేయాల్సిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ లో అన్ని అమ్మవారి ఆలయాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా వసతులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా దేవాలయాల ప్రాంగణంలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మరియు అన్ని ఆలయాల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం DE నిఖిల్ రెడ్డి, AE రాజకుమార్, శానిటేషన్ DE చందన, జలమండలి ఏఈ ఆసిఫ్ అలీ, మొన్సూన్ సిబ్బంది, డీసెల్టింగ్ సిబ్బంది, మరియు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, సదానంద చారి, రామానుజన్, ఫోటో బాలు, రవీందర్ గౌడ్, రమేష్, బాలేందర్,శైనాజ్,ఇస్మాయిల్,శ్యామ్, బాలు మొదలగు వారు పాల్గొన్నారు.



# మేగా జాబ్ మేళాలో పాల్గోన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**జయభేరి, సికింద్రాబాద్ :**

సికింద్రాబాద్ బోయిగూడా, రైల్ కళారంగ్ లో జరిగిన 7వ "రోజ్ గార్ మేళా" కార్యక్రమంలో కేంద్రమంత్రి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన ఐటి, బ్యాంకింగ్, పోస్టల్ రంగాలతో పాటు మొత్తం 10 శాఖల్లో ఉద్యోగాలు పొందిన 176 మందికి కేంద్ర మంత్రి అపాయింట్మెంట్ లెటర్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు. నేడు 7వ రోజ్గార్ మేళా కాగా.. నేటితో కలుపుకుని 5లక్షల పైగా మంది యువకులకు అపాయింట్మెంట్ లెటర్లు అందజేశారు. స్వాతంత్ర్యం వచ్చిన ఏకకాలంలో ఇంత పెద్ద మొత్తంలో ఉద్యోగాల భర్తీ చేపట్టడం ఇదే తొలిసారి. యూత్ పాపులేషన్లో భారతదేశం నెంబర్ వన్.. అనేక అంతర్జాతీయ, సాఫ్ట్వేర్ సంస్థలకు సీఈవోలు భారతీయులు. యువత మేధస్సు ద్వారా రానున్న రోజుల్లో ప్రపంచాన్ని శాసించేలా భారత్ తయారు కానుంది. ఉద్యోగాలు వచ్చిన వారు అంకితభావంతో దేశం కోసం పని చేయాలి. తల్లిదండ్రులను మరిచిపోవద్దని అన్నారు.



# ఆదిలాబాద్ లో విస్తారంగా వర్షాలు

**జయభేరి, ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం కురుస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. జైనథ్ మండలం పుసాయి వద్ద వాగు ఉదృతంగా ప్రవహించడంతో ప్రముఖ పుణ్య క్షేత్రం.. ఎల్లమ్మ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎగువన నుండి వస్తున్న వరదకి ఆలయం సగ భాగం నీటిలోనే ఉంది. వర్షం నాన్ స్టాప్ గా కురుస్తున్నందున వరద ఉదృతి పెరిగి ఆలయం మొత్తం నీట మునిగే అవకాశం లేకపోలేదు. గతంలోనూ ఒకసారి భారీ వర్షాలకు పూసాయి ఎల్లమ్మ ఆలయం నీట మునిగింది. ఆయాలయనికి దిగువన కేరీగామా వాగు సైతం నిండుగా ప్రవహించడంతో ఆలయం వైపు బ్యాక్ వాటర్ పెరుగుతుంది. ప్రతిసారి వర్షాకాలంలో ఆలయం నీట మునుగుతుండటంతో ఎగువన చెక్ డ్యామ్ నిర్మించాలనే గ్రామస్తుల ప్రపోజల్ ఇంకా పెండింగ్ లోనే ఉంది.

# గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**జయభేరి, ఘట్ కేసర్ :**

రాష్ట్రంలో 12,769 గ్రామాలలో 50వేల మంది పంచాయతీ సిబ్బంది ఎండ వాన చలి లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్నారు .వీరిలో నూటికి 80శాతం మంది దళితులేనని వీరి న్యాయమైన డిమాండ్స్ వెంటనే పరిష్కరించాలని సిఐటియు ఘట్కేసర్ మండల కార్యదర్శి ఏం సబిత డిమాండ్ చేశారు ఈరోజు శనివారం ఘట్కేసర్ ఎమ్మార్వో కార్యాలయం దగ్గర గ్రామపంచాయతీ కార్మికుల 17వ రోజు సమ్మెకు పాల్గొని మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఘట్కేసర్ మండల కార్యదర్శి ఎన్ సబిత మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు పంపుఆపరేటర్లు,కారోబార్లు ఎలక్ట్రిషియన్లు, బిల్ కలెక్టర్లు వంటి గ్రామ పంచాయతీ సిబ్బంది కరోన వంటి క్లిష్ట పరిస్థితులలోకూడా తమ ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించారనీ అన్నారు. మోడీ స్వచ్ఛ భారత్ పిలుపు అయిన కేసీఆర్ గారి పచ్చదనం పరిశుభ్రత పిలుపు అయిన చిత్తశుద్ధితో అమలు చేసింది గ్రామ పంచాయితీ సిబ్బంది. గ్రామీణ ప్రజల జీవన విధానంలో ముఖ్య భూమిక పోషిస్తున్న పంచాయతీ సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుంది.సమ్మె చేస్తున్న కార్మికుల పట్ల వివక్ష పాటిస్తుందనీ అన్నారు. 2014సం.2018 లో జరిగిన ఎన్నికలసందర్భంగా పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని సీఎం వాగ్దానం చేశారనీ 9 ఏండ్లు గడిచినా నేటికీ అమలు చేయలేదు. కార్మికులకు కనీస వేతనం లేకుండా వెట్టి చాకిరి చేస్తున్నారు వేతనాలు పెంపు కోసం ప్రభుత్వం రూపొందించిన జీవో నెంబర్ 60 ప్రకారంగా గ్రామపంచాయతీ సిబ్బందికి 19వేల రూపాయలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం కేవలం 8500 మాత్రమే ఇస్తున్న దుస్థితి ఉంది ఈ ఆరాకోర వేతనం సరిపోక రోజువారీగా పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల వల్ల నానా ఇబ్బందులు పడుతున్నారను ఆవేదనా వ్యక్తం చేశారు. వేతనాలు పెంచకపోవడంతో సిబ్బంది ఆరోగ్యాలు, పిల్లల చదువులు, సరైన భోజనం చేయలేకపోతున్నారు వేతనాలు పెంచకుండా పని భారం పెంచడానికి జీవో నెంబర్ 51 ని రూపొందించి ఒకే కార్మికుడు అనేక పనులు చేయాలనే మల్టిపర్పస్ విధానాన్ని తెచ్చింది. దీంతో కార్మికులపై పని భారం పెరుగుతుంది. మల్టిపర్పస్ విధానం రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలి. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలోగొంతెమ్మ కోర్కెలు లేవు. న్యాయం, ధర్మం నీతి ఉంది.గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసమే నేడు సమ్మె జరుగుతుంది కార్మికులను పర్మినెంట్ చేస్తామని వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలునిలబెట్టుకోలేదు పల్లెల్లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల అత్యధికులు దళితులు కావడం వల్లే ప్రభుత్వం వివక్ష పాటిస్తుందా?అనే అనుమానం కలుగుతుంది ప్రమాదవశాత్తు కార్మికులు మరణించినా కనీస ఎక్స్‌గ్రేషియో ప్రభుత్వం ఇవ్వలేకపోవడం సిగ్గుచేటు.గ్రామ పంచాయతీ సిబ్బందికి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం అన్యాయం కాదా? పంచాయితీ సిబ్బంది అంటే ప్రజా సేవకులు.వారి పట్ల ఈ ఉదాసీనత సరైంది కాదు . కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సర్కార్ కార్మికుల హక్కులను కాలరాసే చర్యలకు ఒడిగట్టింది. బీజేపీ నేతలు నేడు టెంట్ల వద్దకు వచ్చి మద్దతు ఇచ్చినప్పటికీ అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను లేకుండా చేస్తున్నది బీజేపీ అనేది మరువకూడదు. కార్పొరేట్లకు ఉపయోగపడే 4 లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికుల పొట్టలు కొట్టి కార్పొరేట్లకు మేలు చేస్తుంది. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిన ఘనత బిజెపి సర్కార్ దే .గత 17రోజులుగా సమ్మెలో ఉన్న ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరం. డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు సిహెచ్ దానయ్య కనకరాజు శివ బాలరాజు వేణు లక్ష్మి బాలమణి నర్సమ్మ .ముత్తమ్మ యాదమ్మ బిక్షపతి రామచందర్ ఈరమ్మ. సత్యమ్మ సిహెచ్ పద్మ జయమ్మ తదితరులు పాల్గొన్నారు

ప్రభాత జయభేరి
jayabheridaily.com

# పాత కాపులకే మళ్లీ టిక్కెట్లు

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న టీ కాంగ్రెస్ లిస్ట్

**జయభేరి, హైదరాబాద్ :**

కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు పేరుతో ఓ సర్వే రిపోర్టు ఆ పార్టీలో కలకలం సృష్టిస్తున్నది. లీడర్ల లో అసంతృప్తికి కారణమవుతున్నది. ముందు నుంచీ హస్తం పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నా సీటు దక్కదేమో ననే టెన్షన్ ఆ పార్టీ లీడర్లలో మొదలైంది. ఏ సెగ్మెంట్‌లో ఎవరికి టికెట్ ఇస్తే గెలుపు ఖాయమనే విషయాన్ని ఆ లిస్టు ద్వారా సిఫారసు చేసినట్టు టాక్. ఈ జాబితాను చూసిన కాంగ్రెస్ నేతలు ఒక్క సారిగా ఖంగుతిన్నారు. అందులో దాదాపు సగానికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారి పేర్లే ఉండటంతో ముందు నుంచీ కాంగ్రెస్‌లో కొనసాగుతున్న లీడర్లు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సెగ్మెంట్లలో సెకండ్ ప్రయారిటీ పేరుతో పెట్టిన పేర్లు కాంగ్రెస్ నేతల మధ్య చర్చకు దారితీసింది. ఈ లిస్టు ఫైనలా? లేక ఏఐసీసీ మార్పులు చేస్తుందా?.. ఇప్పటి నుంచే హైకమాండ్ దగ్గర పైరవీలు చేసుకోవాలా?.. ఇది పాత రిపోర్టా?.. లేక కొత్తదా?.. యాధృచ్ఛికంగానే బయటకు లీకైందా?.. లేక ఉద్దేశపూర్వంగా దొడ్డిదారిన ఎవరైనా లీక్ చేయించారా? అనే సందేహాలు పార్టీ నేతల్లో మొదలయ్యాయి.కాంగ్రెస్ పార్టీ ఆఫీషియల్‌గా సర్వే రిపోర్టును ప్రకటించికపోయినా 119 నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లను ప్రతిపాదించిన ఓ లిస్టు పార్టీ లీడర్ల ఫోన్లలో చక్కర్లు కొడుతున్నది. కొన్ని నియోజకవర్గాలకు ఒక్క పేరును మాత్రమే ప్రతిపాదించగా, మరి కొన్నింటికి మాత్రం సెకండ్, థర్డ్ ప్రాబబుల్స్ పేర్లను ప్రపోజ్ చేసినట్లు స్పష్టమవుతున్నది. పార్టీలో ఇంటర్నల్‌గా లీకైన ఆ సర్వే రిపోర్టు నిజమేనని ఓ కీలక నేత ధృవీకరించారు. ఇది ఏఐసీసీకి పంపడం కోసం సునీల్ కనుగోలు రూపొందించారని ఆ నేత పేర్కొన్నారు. ఈ జాబితాలో దాదాపు 75% సీట్లలో ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన నేతల పేర్లు ఉండటం గమనార్హం. ఇదే విషయం పార్టీ నేతల్లో చర్చకు దారితీసింది. అసంతృప్తికి కారణమైంది. మొదటి నుంచీ పార్టీలో పనిచేస్తున్నా టికెట్‌కు నోచుకోలేకపోయామా? అని బాధపడుతున్నారు. టికెట్ కోసం పైరవీలు, ప్రయత్నాలు తప్పదనే ఆలోచనలో పడ్డారు. అవసరమైతే సీనియర్ల సహాయాన్ని తీసుకోవాలని అనుకుంటున్నారు. ఆ ప్రయత్నాలు ఫలించకపోతే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌తో పాటు ప్రియాంక గాంధీకైనా ఫిర్యాదు చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులను వారికి వివరించాలని ప్లాన్ చేసుకుంటున్నారు. సునీల్ కనుగోలు రిపోర్టులో టీపీసీసీ చీఫ్ రేవంత్‌కు ప్రమేయం లేదనే నేతలు నమ్ముతున్నారు. అందువల్లే ఆయనకు సంబంధం లేకుండా ఢిల్లీకే వెళ్లాలని ఫిక్స్ అవుతున్నట్టు సమాచారం. 51 నియోజకవర్గాల్లో ఇద్దరి చొప్పున పేర్లను సునీల్ కనుగోలు సర్వే రిపోర్టులో ప్రతిపాదించారు. ప్రస్తుతం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న నేతల పేర్లు సైతం ఈ జాబితాలో ఉండటం సరికొత్త సందేహాలకు దారితీసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఫస్ట్ టర్ములో మంత్రిగా పనిచేసి బయటకు వచ్చిన ఓ నేత ప్రస్తుతం ఓ జాతీయ పార్టీలో కీలక పోస్టులో కొనసాగుతున్నారు. ఆయన పేరు సైతం ఈ లిస్టులో ఉండటం గమనార్హం. కేసీఆర్ ఇటీవల ఓ నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఇంటికి రావాలంటూ ఆహ్వానించిన ఒక నేత పేరు కూడా ఇందులో ఉన్నది. 68 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో మాత్రం ఎలాంటి కాంపిటేషన్ లేదని ఈ లిస్టును బట్టి తెలుస్తున్నది. మరో నియోజకవర్గంలో మాజీ పీసీసీ అధ్యక్షుడి పేరును రెండవ ప్రయారిటీ కింద పెట్టడంతో ఆయన షాక్‌లో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ మాజీ మంత్రి భార్యభర్తల పేర్లు ఈ జాబితాలో ఖరారు చేశారు. అంతేగాక ఓ



మాజీ పీసీసీ అధ్యక్షుడు, ఆయన భార్య పేర్లు కూడా టిక్కెట్ జాబితాలోకి ఎక్కాయి. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ మేయర్ పదవి ఆశించి అసంతృప్తితో కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ కార్పొరేటర్, వారి తమ్ముడి పేరు కూడా టిక్కెట్ల పంపిణీ జాబితాలో రెండు వేర్వేరు నియోజకవర్గాల్లో ఫస్ట్ ప్రయారిటీలో ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్సీలు, మాజీ సీఎం కూతురు పేరు కూడా ఈ జాబితాలో ఉన్నది. ప్రస్తుతం పార్టీలో లేని వారికి కూడా టిక్కెట్లు రిజర్వు కావడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చంశనీయంగా మారింది.సర్వే రిపోర్టు లీకైన విషయం తెలుసుకొని పలు నియోజకవర్గాల ఇంచార్జిలు టీపీసీసీ, ఏఐసీసీకి చెందిన ముఖ్య లీడర్లకు ఫోన్లు చేశారు. 'అన్నా లిస్టులో మా పేరు ఉన్నదా?' అంటూ ఆరా తీశారు. ఉన్నోళ్లకు ఓకే చెబుతూనే మరో వైపు పేరు లేనివాళ్లకు ఇది ఫైనల్ లిస్టు కాదనే ఆన్సర్ ఇస్తున్నారు. ఇది సర్వే మాత్రమేనని, ఏఐసీసీ తర్వాత ఫైనల్ లిస్టును రిలీజ్ చేస్తుందని సర్దిచెప్తున్నారు. లీకైన లిస్టుతో నెలకొన్న అసంతృప్తిని ఈ రూపంలో చల్లబరుస్తున్నారు. సర్వే రిపోర్టుతో సంబంధం లేకుండానే సునీల్ కనుగోలు టీమ్ చేస్తున్న సోషల్ మీడియా ప్రచారంపై ఓ సీనియర్ నేత గతంలో ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డారు. విషయాన్ని నేరుగా రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లారు.కాంగ్రెస్ స్ట్రాటెజిస్ట్ సునీల్ కనుగోలు చేసిన సర్వేపై అనుమానాలూ వస్తున్నాయి. పార్టీకి గుర్తింపు తెస్తూ నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయిలో తిరిగినోళ్ల పేర్లు ఆ జాబితాలో లేకపోవడమే ఇందుకు నిదర్శమనంటూ వారికి వారు సర్దిచెప్పుకుంటున్నారు. ఏఐసీసీకి పంపిన ఈ రిపోర్టు ఉద్దేశంపైనే సందేహాలున్నాయని ఓ నేత వ్యాఖ్యానించారు. ఇటీవల పార్టీలో చేరిన ఓ మాజీ ఎంపీ అనుచరుల పేర్లు ఐదారు నియోజకవర్గాల్లో కనిపించడాన్ని సదరు నేత జీర్ణించుకోలేకపోయారు. పార్టీలో చేరిన నెల రోజుల్లోనే గెలుపు పక్కా అంటూ రిపోర్టు ఇవ్వడాన్ని తప్పుపడుతున్నారు. సర్వే రిపోర్టు తయారీ సమయంలోనే లోపాయికారీగా ఒప్పందాలు జరిగాయేమో అనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఏఐసీసీ ఈ గందరగోళంపై నిర్దిష్టమైన క్లారిటీ ఇవ్వకపోతే 50% నియోజకవర్గాల్లోని పార్టీ కేడర్లో కన్ఫ్యూజన్ నెలకొనే ప్రమాదమున్నది.

# నాందేడ్ నుంచి కేసీఆర్..

**జయభేరి, హైదరాబాద్ :**

టీఆర్ఎస్‌ను భారత రాష్ట్రసమితిగా కేసీఆర్ మార్చారు కానీ.. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా బీఆర్ఎస్ ను విస్తరించేందుకు ఆసక్తి చూపించడం లేదు. మొదట్లో ఇతర రాష్ట్రాలకు చెందిన నేతల్ని ప్రగతి భవన్ కు పిలిపించి చర్చించేవాళ్లు. ఏపీ, ఒడిషాలకు స్టేట్ ఇంచార్జులను నియమించారు. కానీ తర్వాత సైలెంట్ అయిపోయారు. ఒక్క మహారాష్ట్రలో మాత్రం అదీ కూడా ఓ ప్రాంతంలో మాత్రమే ప్రత్యేక దృష్టి పెట్టి పార్టీని విస్తరిస్తున్నారు. దీని వెనుక అసలు కారణం ఏమిటన్నది ఎవరికీ తెలియదు. కానీ.. కేసీఆర్ మహారాష్ట్ర నుంచి లోక్ సభకు పోటీ చేసే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం మాత్రం గుప్పుమంటోంది. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి కేసీఆర్ పోటీ చేయాలని యోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ తో పాటు తెలంగాణ సరిహద్దు ఉన్న మహారాష్ట్రలోని ఏదైనా నియోజకవర్గం నుంచి బరిలోకి దిగాలని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. నాందేడ్ అయితే కరెక్ట్ గా ఉంటుందని చెబుతున్నారు. ఈ దిశగా సర్వేలు కూడా చేయించినట్లుగా చెబుతున్నారు. అక్కడ నుంచి ఇప్పటికే చేరికలు జోరుగా సాగాయి. పార్టీని సైతం ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సులువవుతోందని బీఆర్ఎస్ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.ఇక 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా గెలిచారు. గతంలో ఇందిరాగాంధీ తన సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీని



వదులుకుని మెదక్ నుంచి ఎంపీగా విజయం సాధించారు. గతంలో చాలామంది నేతలు తమ సొంత రాష్ట్రం నుంచి కాకుండా వేరే రాష్ట్రాల నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. తమ పార్టీని వేరే రాష్ట్రాల్లో కూడా బలోపేతం చేయడం, శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు ఇలా నేతలు వేరే రాష్ట్రాల నుంచి పోటీ చేశారు. ఇప్పుడు కేసీఆర్ కూడా అదే వ్యూహాన్ని అమలు చేయాలని చూస్తున్నారని తెలుస్తోంది. అందుకేమహారాష్ట్ర నుంచి ఎంపీగా బరిలోకి దిగాలని సమాలోచనలు జరుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది.తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ స్థానాల నుంచి ఎంపీగా పోటీ చేసి లోక్ సభకు వెళ్లారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ఉద్యమాన్ని సైతం ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. ఇప్పుడు మహారాష్ట్ర నుంచి కేసీఆర్ పోటీ చేయడం వల్ల అక్కడ పార్టీకి మైలేజ్ పెరగడంతో పాటు బీఆర్ఎస్ గురించి ప్రజల్లో చర్చ జరుగుతుందనేది ఆపార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. ఇక అక్కడి నుంచి పోటీ చేయడంపై ఇప్పటికే జాతీయ స్థాయిలో పేరున్న పలు సంస్థలతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించుకున్నారట. మహారాష్ట్ర నుంచి ఎంపీగా గెలిచి, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే జాతీయ రాజకీయాల్లో కేసీఆర్ క్రియాశీలకం కానున్నారు. అప్పుడు తెలంగాణ సీఎంగా కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగించే అవకాశముంది. అటు లోక్‌సభ ఎన్నికల్లో ఇతర రాష్ట్రాల్లో అభ్యర్థులను పోటీలోకి దింపేందుకు బలమైన వ్యక్తులతో పాటు పలువురు సినీ, క్రీడా ప్రముఖులతో కేసీఆర్ చర్చలు జరుపుతున్నారు.

# ఖమ్మం జిల్లాల్లో పొంగులేటీ హవా సాగేనా

**జయభేరి, ఖమ్మం :**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బలమైన నేతగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎదిగారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మంచి పట్టు ఉన్న లీడర్‌గా పొంగులేటి ఉన్నారు. ఇటీవలే ఖమ్మంలో కాంగ్రెస్ నిర్వహించిన భారీ బహిరంగ సభలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇదే సభలో పొంగులేటి అనుచరులు, పలు పార్టీల నేతలు కూడా భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. పొంగులేటిని బీజేపీ పార్టీలో చేరాలని చేరికల కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్, బీజేపీ నేతలు తమ పార్టీలో చేరాలంటూ ఆహ్వానించారు. పలు మార్లు చర్చలు జరిపారు. కానీ పొంగులేటి ఇందుకు ససేమిరా అన్నారు. పొంగులేటి గతంలో అన్ని నియోజకవర్గాల్లోనూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి ప్రజాభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీ మార్పుపై ఖమ్మంలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రధాన అనుచరులను పిలిపించుకొని వారి అభిప్రాయాలు సేకరించారు.పొంగులేటి ప్రధాన అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరాలని సూచించారు. వారు కోరినట్టుగానే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనుచరుల నిర్ణయమే.. తన నిర్ణయమని పొంగులేటి పలుమార్లు ప్రకటించారు. పొంగులేటి వర్గానికి చెందిన ఐదుగురికి ఎమ్మెల్యే టికెట్లు గ్యారంటీగా ఇస్తేనే కాంగ్రెస్‌లో చేరతారంటూ ప్రచారం సాగింది.. తనతో పాటు మరో ఇద్దరికి సీటు ఖచ్చితంగా ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరినట్లు నాయకులు అనుకున్నారు. కానీ కర్నాటక ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు వేచి చూసిన పొంగులేటి కాంగ్రెస్‌కి అనుకూల ఫలితాలు రావడంతో కాంగ్రెస్ పార్టీపై ఆసక్తి చూపారని తెలుస్తోంది.



పొంగులేటి కాంగ్రెస్ పార్టీలో చేరేముందు ఎటువంటి కండిషన్స్ పెట్టలేదట. ఈ నేపథ్యంలోనే ఆయన చేరికపై వెనుక భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.పొంగులేటి కాంగ్రెస్‌లో చేరడానికి చాలా కారణాలు ఉన్నాయని నేతలు అనుకుంటున్నారు. కానీ ఎవరు ఏమి అనుకున్న కూడా పొంగులేటి టార్గెట్ మాత్రం బీఆర్ఎస్‌ని గద్దెదించడం, కేసీఆర్ ప్రభుత్వాన్ని రాబోయే ఎలక్షన్లలో ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఖమ్మం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను గెలిపించి తన సత్తా చూపిస్తానని ఛాలెంజ్ చేసారు.

పొంగులేటి పోటీ చేసే అసెంబ్లీ నియోజకవర్గం కూడా డిసైడ్ అవ్వలేదని, ఉమ్మడి జిల్లాలోని మూడు జనరల్‌లలో ఒక నియోజకవర్గం నుంచి ఆయన పోటీ ఉంటుందని అంటున్నారు. ఖమ్మం నుంచే పొంగులేటి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తారని కాంగ్రెస్ వర్గాల విశ్వసనీయ సమాచారం. పొంగులేటి వ్యూహాత్మకంగా నడుస్తున్నారని ఆయన అనుచరులే చెబుతున్నారు. పొంగులేటితో ఖమ్మం కాంగ్రెస్ పార్టీలో ముందు ముందు జరిగే పరిస్థితులను ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

# జేఎన్టీయూ కు నాక్ షాక్

**జయభేరి, హైదరాబాద్ :**

జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీకి నేషనల్ అసెస్‌మెంట్ & అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) పెద్ద షాకిచ్చింది. యూనివర్సిటీ గ్రేడింగ్‌ను 'ఏ ప్లస్' గ్రేడ్ నుంచి 'ఏ' గ్రేడ్‌కు తగ్గించింది. జాతీయ స్థాయిలో నిలిచేందుకు న్యాక్ గుర్తింపు, గ్రేడింగ్ కోసం ప్రయత్నించిన జేఎన్‌టీయూకు ప్రస్తుతం 'ఏ ప్లస్' గ్రేడ్ ఉండగా.. తాజాగా 'ఏ గ్రేడ్'తో సరిపెట్టారు. ఇతర యూనివర్సిటీలతో పోల్చితే నాణ్యమైన బోధన, ఉన్నతస్థాయి మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ.. వర్సిటీకి తక్కువ గ్రేడ్ రావడంపై జేఎన్‌టీయూ వీసీ కట్టా నరసింహారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మంజూర్ హుస్సేన్ స్పందించారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో జులై 20న చర్చించారు. న్యాక్ తీసుకున్న ఈ నిర్ణయ ప్రభావం 90 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థుల భవిష్యత్‌పై చూపనుందని, ఏ ప్లస్ ప్లస్ గ్రేడింగ్ కోసం తాము అప్పీలు చేయనున్నామని రిజిస్ట్రార్ తెలిపారు. వర్సిటీలోని ప్రముఖ విభాగాల విభజన, కొత్త విభాగాల ఏర్పాటు.. తదితరాలు న్యాక్ గుర్తింపుపై ప్రభావం చూపాయని కొందరు ఆచార్యులు అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల మరోసారి యూజీసీ పది సంవత్సరాల పాటు స్వయంప్రతిపత్తి (అటానమస్) హోదాను సాధించింది. గతంలో రెండుసార్లు ఆరేళ్ల చొప్పున స్వయంప్రతిపత్తి ప్రకటించిన యూజీసీ ఈసారి ఏకంగా పదేళ్లపాటు అటానమస్ హోదాను దక్కించుకుని.. ఓయూ చరిత్రలోనే మరో మైలురాయిని అధిగమించింది. ఓయూకు న్యాక్ ఏ గుర్తింపు ఉండడం, ఇంజినీరింగ్ కళాశాలలోని అన్ని విభాగాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ ఎన్‌బీఏ గుర్తింపు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న యూజీసీ అధికారులు కళాశాలను సందర్శించకుండానే 202223 నుంచి 203132 వరకు స్వయంప్రతిపత్తిని ప్రకటించినట్లు ఓయూ అధికారులు తెలిపారు.ఓయూ చరిత్రలోనే మరో మైలురాయిని అధిగమించింది. 1929లో స్థాపించిన ఈ కళాశాలకు గతంలో రెండు సార్లు ఆరేళ్ల చొప్పున అటానమస్ హోదా దక్కగా, తాజాగా మూడోసారి పదేళ్ల పాటు అటానమస్ గుర్తింపునిస్తూ యూజీసీ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ హోదాతో కోర్సులు, సిలబస్ రూపకల్పన అంశాల్లో కళాశాలకు స్వేచ్ఛ ఉంటుందని, పరిశోధనా ప్రాజెక్టుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. ఏపీలోని జూనియర్ కళాశాలల్లో మూడో విడత ప్రవేశాల గడువును అధికారులు పొడిగించారు. 202324 ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల గడువు ఆగస్టు 17తో ముగియనుందని ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలు పొందడానికి ఇదే చివరి విడత అని.. మరోసారి గడువు పొడిగింపు ఉండదని ఆయన స్పష్టం చేశారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. మే 15 నుంచి జూన్ 14 వరకు మొదటి విడత ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ జరిగింది. జూన్ 14తో మొదటి విడత ప్రవేశాలు, జులై 15 వరకు రెండో విడత ప్రవేశాలు జరిగాయి. ప్రస్తుతం చివరి విడత ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి రాత పరీక్షలు నిర్వహించకుండా కేవలం పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మాత్రమే ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్న సంగతి తెలిసిందే.



# స్వర్ణ ప్రాజెక్టులోకి భారీ వరద నీరు

**జయభేరి, సారంగాపూర్ :**

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. ఎడతెరిపిలేని వానలకు సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరడంతో ప్రాజెక్టు నిండు కుండలా కనిపిస్తుంది. దీనితో వరద ప్రభావం పెరగడంతో ప్రాజెక్టు అధికారులు రెండు గేట్లు విడుదల చేసి 10000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు కాగా ప్రస్తుతం 1173 అడుగులుకు ఉంది. అధికారులు ఇప్పటికే పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



# ఆకట్టుకుంటున్న నానిజీపూర్ వాటర్ ఫాల్స్

**జయభేరి, రంగారెడ్డి :**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో శంషాబాద్ మండలంలోని నానాజీపూర్ లో వాటర్ ఫాల్స్ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలకు ఎన్టేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో శంషాబాద్ మండలంలోని ననాజీపూర్ వద్ద అద్భుత జలపాతాలను చూసేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలతో గత రాత్రి నుండి ననాజీపూర్ లోని ఎన్టేరు వాగుకు వరద ప్రవాహం పోటెత్తింది. దీంతో అద్భుత జలదృశ్యం ఆవిష్కృతమైంది. ఈ నేపథ్యంలో నమాజీపూర్ లోని అద్భుత వాటర్ ఫాల్స్ ను తిలకించేందుకు పర్యాటకులు ఈ గ్రామానికి క్యూ కడుతున్నారు. మరోవైపు ననాజీపూర్ వాటర్ ఫాల్స్ వద్ద గతంలో పలువురు యువకులు గల్లంతై ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. శంషాబాద్ పోలీసుల ఆదేశం మేరకు పర్యాటకులను వాటర్ ఫాల్స్ వద్దకు కట్టడి చేసేందుకు హెచ్చరిక బోర్డులతో పాటు ఎర్ర జెండాలను ఎగరేశారు.



# హిమాయత్ సాగర్ ఆరు గేట్లు ఎత్తివేత

**జయభేరి, రంగారెడ్డి :**

జంట జలాశయాలైన హిమాయత్ సాగర్ కు వరద నీరు పోటెత్తడంతో ఆరు గేట్లను ఎత్తారు. హిమాయత్ సాగర్ గరిష్ట నీటిమట్టడానికి చేరుకోవడంతో శుక్రవారం రాత్రి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, డిసిపి జగదీశ్వర్ రెడ్డి చేతుల మీదుగా జలమండలి అధికారులు రెండు గేట్లను ఎత్తిన విషయం తెలిసిందే. అయితే వరద ప్రవాహం అంత కంతకూ పెరుగుతుండడంతో శనివారం నాడు మరో నాలుగు గేట్లను రెండు ఫీట్ల మేర ఎత్తి 4120 క్యూసెక్కుల నీటిని మూసిలోకి వదిలారు అధికారులు. హిమాయత్ సాగర్ 6 గేట్లను ఎత్తడంతో ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు ను వరద నీరు ముంచెత్తింది. దీంతో హిమాయత్ సాగర్ నుండి కాళీ మందిర్ వైపు రాకపోకలను నిషేధించారు. మరోవైపు ఆరు గేట్లు ఎత్తడంతో మూసీకి వరద తాకిడి అధికమైంది. దీంతో మూసి పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. హిమాయత్ సాగర్ నీటిమట్టం 2763.50 అడుగులు కాగా ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నట్లు అధికారులు ప్రకటించారు. గత నాలుగు రోజులుగా హిమాయత్ సాగర్ ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఈసీ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో హిమాయత్ సాగర్ కు వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది.

# మిర్యాలగూడ పట్టణంలో దొంగల హల్ చల్

**జయభేరి, నల్గొండ :**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో దొంగలు హల్ చల్ చేసారు. భాగ్యనగర్ కాలనీలో వరుసగా నాలుగిళ్లలో దొంగలు చోరీ చేసారు. ఆరు తులాల బంగారం, 400 గ్రాముల వెండి, 2లక్షల 50 వేల నగదు అపహరించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం ద్వారా పరిసరాలను పరిశీలిస్తున్నారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలు రికార్డ్ అయ్యాయి.

# ఏపీలో పేలుతున్న మాటల తూటాలు

**జయభేరి, విజయవాడ :**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మాటల తూటాలు పేలుతున్నాయి. నువ్వొకటంటే నే రెండంటా అన్న రీతిలో మూడు ప్రధాన పార్టీలకు చెందిన అగ్ర నేతలు ఎడాపెడా ప్రత్యర్థులను ఓ ఆట ఆడేసుకుంటున్నారు. తాజాగా ఈ రేసులోకి ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా ఎంటరవడంతో మాటల మంటలు పీక్ లెవెల్‌కి చేరినట్లయ్యింది. ఇదివరకు జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు నారా లోకేశ్ చేసే విమర్శలు, ఆరోపణలకు వైసీపీ తరపున మంత్రులు, మాజీ మంత్రులు, మరికొన్ని సార్లు ప్రభుత్వ సలహాదారులు, ఇంకొన్ని సందర్భాలలో ఎమ్మెల్యేలు స్పందించేవారు. కానీ తాజాగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ స్వయంగా స్పందించడం ప్రారంభించారు. దాంతో ఏపీలో పొలిటికల్ గేమ్ మరింత హీటెక్కే పరిస్థితి కనిపిస్తోంది. ఏపీలో ఎన్నికలకు ఇంకా 9 నెలల గడువుంది. ఏదైనా అనూహ్య నిర్ణయం జరిగితే తప్ప 2024 ఏప్రిల్ నెలలో గానీ ఎన్నికలు జరగవు. కానీ ఏపీలో రాజకీయ వాతావరణం రేపో ఎల్లుండో ఎన్నికలు అన్న చందంగా వుంది. దానికి కారణం ఓవైపు ప్రభుత్వాధినేత వైఎస్ జగన్ వారానికో సంక్షేమ పథకానికి సంబంధించిన కార్యక్రమం ఏర్పాటు చేయడం, అందులో రాజకీయ ప్రసంగాలు చేయడం కొనసాగిస్తున్నారు. ఇంకోవైపు వారాహి విజయ యాత్ర పేరిట పది నెలల ముందుగానే ఎన్నికల ప్రచార పర్వాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్.. తన ప్రసంగాలను పదునెక్కిస్తున్నారు. తొలివిడత యాత్రకు కొనసాగింపుగా ప్రారంభమైన మలివిడతతో ముఖ్యమంత్రి జగన్‌ను జగ్గూ భాయ్ అని.. జగ్గూ అని సంబోధించడం ప్రారంభించారు. ఇంకోవైపు చంద్రబాబునాయుడు ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆయనా ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో అస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. మరోవైపు జనవరి నెలాఖరు నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్న టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జిల్లాల వారీగా ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెడుతున్నారు. ఇలా పవన్ కల్యాణ్, చంద్రబాబునాయుడు, లోకేశ్ నాయుడుల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శలు, ఆరోపణలకు వైసీపీ నేతలు ఎక్కడికక్కడ కౌంటర్లిస్తున్నారు. ఎదురు దాడి చేస్తున్నారు. ఇదంతా కొనసాగుతుండగానే జగన్ మోహన్ రెడ్డి తన మాటల్లో పదును పెంచారు. ప్రసంగాలలో వేడి పెంచారు.ఒకరకంగా చెప్పాలంటే పవన్ కల్యాణ్ ఏపీలో కొనసాగుతున్న వాలంటీర్ల వ్యవస్థనుద్దేశించి చేసిన కామెంట్లు ఏపీలో రాజకీయ కాకను పెంచాయని చెప్పాలి. ఏపీలో లక్షలాది మంది మహిళలు కనిపించకుండా పోయారని, వారి అంతర్ధానం వెనుక వైసీపీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న వాలంటీర్లున్నారన్న తీవ్ర ఆరోపణలు చేశారు పవన్ కల్యాణ్. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో ప్రభుత్వాధినేతలు, వాలంటీర్లు పెద్ద ఎత్తున విరుచుకుపడ్డారు. ఆయన కామెంట్లు చేసిన నుంచి రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూనే వున్నారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తూనే వున్నారు. అయితే, ఎంతో దూరాలోచనతో ఏర్పాటు చేసుకున్న వాలంటీర్ వ్యవస్థపై రాజకీయ ప్రత్యర్థులు కామెంట్ చేయడాన్ని జగన్ మోహన్ రెడ్డి సహించనట్లు కనిపిస్తోంది. దాంతో జులై 21న తిరుపతి జిల్లా వెంకటగిరి వేదికగా జగన్ మోహన్ రెడ్డి స్వరం పెంచారు. క్యారెక్టర్ లేనోళ్ళంగా చక్కగా పని చేస్తున్న వాలెంటీర్లపై కామెంట్స్ చేస్తున్నారంటూ రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు గుప్పించారు. ఏ నాయకుని పేరు ప్రస్తావించకుండా వారు గతంలో చేసిన వ్యాఖ్యలు, వారి వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలను ఉదహరించారు వైఎస్ జగన్. జగన్ తాజాగా కామెంట్లతో ఏపీలో పొలిటికల్ హీట్ పీక్ లెవెల్‌కి చేరినట్లయ్యింది. నిజానికి జూన్ 14న పవన్ కల్యాణ్ వారాహి విజయ యాత్ర ప్రారంభ సమయంలోనే పొలిటికల్ హీట్ ప్రారంభమైంది. పద్నాలుగో తేదీన యాత్ర ప్రారంభిస్తారని తెలిసిన వెంటనే ఆ ప్రాంతా జిల్లా పోలీసు యంత్రాంగం అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, వీధి సమావేశాలు నిర్వహించరాదంటూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అసలు యాత్ర ప్రారంభమవుతుందా లేదా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. ఎట్టిపరిస్థితుల్లో యాత్ర ప్రారంభమవుతుందని జనసేన రాష్ట్ర నాయకులు ప్రకటించడంతో పార్టీ వర్సెస్ పోలీసులుగా ఉద్రిక్తత ఏర్పడుతుందని అంతా భావించారు. కానీ జూన్ 14న ఎలాంటి ఇబ్బంది లేకుండానే వారాహి విజయయాత్ర ప్రారంభమైంది. యాత్ర ప్రారంభమైన నాలుగైదు రోజులు పవన్ కల్యాణ్ ప్రసంగాలు సాదాసీదాగానే సాగాయి. ఆ తర్వాతే తన ప్రసంగాలను పదునెక్కించడం మొదలుపెట్టారు పవన్ కల్యాణ్. జగన్ మోహన్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడం ప్రారంభించారు. జగన్ కుటుంబానికి బైరటీస్ గనులు ఎలా వచ్చాయో చెప్పాలనడంతో ఆరోపణల పర్వంలో వేడి రగులుకుంది. బెంగళూరు నుంచి వచ్చిన ఓ సైంటిస్టు నుంచి బైరటీస్ గనులను లాక్కున్నారంటూ ఆ భూములన్నీ అక్కడి పేద శెట్టి బలిజలవే అన్నారు. ఈక్రమంలోనే పవన్ కల్యాణ్‌పై ఎదురు దాడి ప్రారంభించారు వైసీపీ నేతలు.ఆ తర్వాత జగన్ నుద్దేశించి ఏకవచన ప్రయోగం వైసీపీ నేతలకు మంట పుట్టించింది. అయినా తగ్గని పవన్ కల్యాణ్.. జగన్ ని జగ్గూ భాయ్ అన్నారు. ఇంకా రెచ్చగొడితే జగ్గూ అని పిలుస్తానన్నారు.

ఈక్రమంలో మాజీ మంత్రి పేర్ని నాని విలేకరుల సమావేశంలో పవన్ కల్యాణ్‌నుద్దేశించి రెండు చెప్పులను చూపించారు. గతంలో ఓ సభలో పవన్ కల్యాన్ ఒక చెప్పు చూపిస్తే.. పేర్ని నాని మీడియా మీట్‌లో ఏకంగా రెండు చెప్పులు చూపిస్తూ జనసేనానికి వార్నింగ్ ఇచ్చారు. చెప్పుల వ్యవహారంపై వెటకారంగా స్పందించిన పవన్ కల్యాణ్.. తన రెండు చెప్పులను అన్నవరం టెంపుల్ దగ్గర ఎవరో కొట్టేశారంటూ వ్యంగ్యోక్తులు విసిరారు. ఇలా కొనసాగిన వారాహి తొలి విడత తర్వాత రెండో విడతలోను పవన్ కల్యాణ్ ఎక్కడా తగ్గలేదు. దాంతో వైసీపీ తరపున మంత్రులు ఆళ్ళ నాని, అంబటి రాంబాబు, రోజా తదితరులు ఎదురు దాడి ప్రారంభించారు. ఈ వేడి సరిపోదన్నట్లు తాజాగా ముఖ్యమంత్రి స్వయంగా పవన్ కల్యాణ్, లోకేశ్, నందమూరి బాలకృష్ణ, చంద్రబాబులపై వారి పేర్లు ప్రస్తావించకుండా వ్యంగ్యంతో కూడిన విమర్శలు చేశారు. జగన్ తాజా కామెంట్లు ఏపీలో మరోసారి కాకరేపుతున్నాయి. వీటి ఆధారంగా ఆయన రాజకీయ ప్రత్యర్థులు ఎలా స్పందిస్తారనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా మొదలైంది. మొత్తమ్మీద ఏపీలో రాజకీయ నాయకుల మధ్య మాటల మంటలు ఇంటరెస్టింగ్‌గా కొనసాగుతున్నాయి.

## వైఫై రూటర్.. కీలకం


**జయభేరి, కడప :**

సీబీఐ మరోసారి వివేకానంద రెడ్డి హత్య కేసులో సంచలన ఆరోపణలు చేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిలు కుట్ర చేశారని సీబీఐ కోర్టుకు సమర్పించిన చార్జిషీట్లో పేర్కొంది. కుట్ర, హత్య సాక్ష్యాల చెరిపివేతను కూడా ప్రస్తావించింది. గూగుల్ టేక్ అవుట్, ఫోన్ల లొకేషన్ డేటాలు, ఫొటోలను కోర్టుకు సమర్పించింది. వివేకా హత్య కేసు దర్యాప్తు కొనసాగుతోందని.. వివేకా పీఏ కృష్ణారెడ్డి పై అనుమానాలు ఉన్నప్పటికీ తగిన ఆధారాలు లభించలేదని తెలిపింది. సాక్ష్యాల చెరిపివేత సమయంలో అక్కడ మనోహర్ రెడ్డి ఉన్నప్పటికీ ఆయన ప్రమేయంపై నిర్ధారణ కాలేదని తెలిపింది. వివేకా ఇంట్లో వైఫై రూటర్లకు కనెక్ట్ అయిన వారి వివరాలు సేకరిస్తున్నామని వివరాలు ఇవ్వాలని అధికారులను కోరామని తెలిపింది. వివేకా రాసిన లేఖపై నిన్ హైడ్రిన్ పరీక్ష నివేదిక రావాలని చెప్పింది. పలు మొబైల్ ఫోన్ల ఫోరెన్సిక్ రిపోర్టులు త్రివేండ్రం సీడాక్ నుంచి రావాల్సి ఉందని తెలిపింది. నిందితులు సునీల్ యాదవ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ఇంట్లోనూ, ఇంటి పరిసరాల్లోనూ ఉన్నారని గూగుల్ టేక్ అవుట్ ద్వారా తెలుసుకున్నట్టు తెలిపింది సీబీఐ. ప్రాథమిక చార్జిషీట్ లో పేర్కొన్న అంశాలు తుది చార్జిషీట్ లో మార్పులు చేశామని సీబీఐ తెలిపింది. వివేకానందరెడ్డి ఇంట్లో 2019, మార్చి 14న రాత్రి సునీల్ యాదవ్ వున్నాడు. అర్ధరాత్రి దాటాక 2.35 గంటలకు వివేకా నివాసం సమీపంలో, 2.42 గంటలకు నివాసం లోపల ఉన్నాడని.. సునీల్ సెల్ నెంబర్ గూగుల్ టేక్ అవుట్ ద్వారా గుర్తించామని సీబీఐ గతంలో పేర్కొంది. తాజాగా తుది నివేదికలో ఇది నిజం కాదని సీబీఐ కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లో స్పష్టం చేసింది. వివేకా ఇంట్లో 2019, మార్చి 14 అర్ధరాత్రి దాటిన తర్వాత సునీల్ యాదవ్ లేడని.. 2019, మార్చి 15న ఉదయం 8.05 గంటలకు వివేకా ఇంటి బయట, 8.12 గంటలకు ఇంటిలోపల వున్నాడని తెలిపింది. గతంలో గ్రీన్‌విచ్ కాలమానం ప్రకారం గూగుల్ టేక్ అవుట్ ద్వారా తెలుసుకున్నాం. కానీ ఏ దేశంలోనైనా స్థానిక కాలమానం ప్రకారమే చూడాలని, గతంలో సమాచార సేకరణలో పొరపాటు జరిగిందని తాజా చార్జిషీట్ లో సీబీఐ పేర్కొంది. వివేకానందరెడ్డి కడప ఎంపీ సీటును ఆశించలేదని వైఎస్ షర్మిల వాంగ్మూలం ఇచ్చినట్టు సీబీఐ తెలిపింది.

వివేకా హత్య కేసులో వైఎస్ అవినాష్ రెడ్డికి సిబిఐ కోర్టు జులై 14వ తేదీన సమన్లు జారీ చేసింది. ఆగస్టు 14న కోర్టుకు హాజరు కావాలని వైకాపా ఎంపి అవినాష్ రెడ్డికి సమన్లు పంపింది. వివేకా హత్య కేసులో అనుబంధ ఛార్జిషీట్ ను సిబిఐ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అవినాష్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి,ఉదయ్ కుమార్ రెడ్డిపై ఛార్జిషీట్ వేసింది. వివేకా హత్య కేసులో 8వ నిందితుడిగా సిబిఐ అవినాష్ రెడ్డిని చేర్చింది. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకు చేసిన కుట్రలో నిందితుల పాత్ర స్పష్టంగా ఉందని సీబీఐ దాఖలుచేసిన అభియోగ పత్రంలో పేర్కొన్నట్లు తెలిసింది. హత్యకు డబ్బు సమకూర్చిందెవరో తేలాల్సి ఉందన్న కేంద్ర దర్యాప్తు సంస్థ.. ఈ కేసులో సీబీఐ కోర్టుకు అనుబంధ అభియోగపత్రం సమర్పించింది. ఇందులో A6గా ఉదయ్‌కుమార్‌రెడ్డి, A7గా వై.ఎస్.భాస్కరరెడ్డి, A8గా వై.ఎస్.అవినాష్‌రెడ్డిలను పేర్కొంది. వివేకా వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన ఎం.వి.కృష్ణారెడ్డి, వివేకా ఇంట్లో వంటమనిషి లక్ష్మి కుమారుడు ఏదుల ప్రకాష్‌లను ఇదే కేసులో అనుమానితులుగా పేర్కొంది.సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ అభియోగపత్రం దాఖలు చేసినా.. ఇంకా దర్యాప్తు కొనసాగించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. వివేకా చనిపోయే ముందు రాసిన లేఖలో వేలిముద్రలు, చేతి రాతను గుర్తించడంలో భాగంగా లేఖను కోర్టు నుంచి సీబీఐ తీసుకుని, దిల్లీ ఎఫ్ఎస్ఎల్కు పంపింది. నిన్‌హైడ్రిన్ పరీక్ష ద్వారా వేలిముద్రలను గుర్తించాలని కోరింది. ఎం.వి.కృష్ణారెడ్డి, వంటమనిషి లక్ష్మి కుమారుడు ప్రకాష్‌ను అనుమానితులుగా పేర్కొంది. వీటన్నింటిపై స్పష్టత నిమిత్తం దర్యాప్తును మరికొంతకాలం కొనసాగించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకూ ఎలాంటి విజ్ఞప్తిని కోర్టులకు చేయలేదు. గడువు సుప్రీంకోర్టే నిర్ణయించినందున.. అదనపు గడువు కోసం కూడా ఆ కోర్టు దగ్గరే పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుందని న్యాయవర్గాలు చెబుతున్నాయి. కానీ సీబీఐ ఇప్పుడు తుది ఛార్జిషీటును మార్చడంతో మొత్తం విషయం అంతా మారిపోయింది.

## దగ్గుబాటిని లైట్ గా తీసుకున్న వైసీపీ

**జయభేరి, ఒంగోలు :**



ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురంధరేశ్వరి ఛార్జ్ తీసుకున్న తొలి రోజు నుంచే వైసీపీ ప్రభుత్వం మీద డైరెక్ట్ అటాక్ మొదలు పెట్టారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరవయ్యాయని, ప్రభుత్వం అవినీతి ఊబిలో కూరుకుపోయిందని, కేంద్రం నుంచి నిధులు వస్తున్నా.. ఎందుకు అభివృద్ధి చేయలేకపోతున్నారంటూ.. ప్రశ్నాస్త్రాలు సంధించారు. కానీ.. ఆమె ఎంత ఏం మాట్లాడినా, ఎంత గట్టిగా అడిగినా, అధికార వైసీపీ నుంచి మాత్రం నామ మాత్రపు స్పందన కూడా లేదు. ముఖ్య నాయకులు ఎవ్వరూ ఇంతవరకు నోరు విప్పలేదు, పురంధేశ్వరికి కౌంటర్ ఇవ్వలేదు. అదే సమయంలో ఇంతకు ముందు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ఆరోపణలు చేసినప్పుడు మంత్రి బొత్స సత్యనారాయణ లాంటి సీనియర్స్ సైతం నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదా ఇచ్చి.. తర్వాత మాట్లాడండని కౌంటర్ అటాక్ కు దిగారు. నాలుగేళ్లుగా చేయని ఆరోపణలు ఇప్పుడు చేస్తున్నారంటే...ఎన్నికల ఏడాదిలో రాజకీయ ప్రయోజనాల కోసమే కదా అని ప్రశ్నించారు. మిగతా బీజేపీ నేతల పై ఎక్కడా తగ్గని వైసీపీ నేతలు, మంత్రులు పురంధరేశ్వరి విషయంలో మాత్రం ఎందుకు డిఫరెంట్ స్టాండ్ తీసుకున్నారన్న చర్చ జరుగుతోంది.పురంధేశ్వరి కొత్తగా పార్టీ బాధ్యతలు తీసుకున్నారు కనుక తన అస్తిత్వం కోసం ఆరోపణలు చేస్తున్నారు తప్ప.. మరోటి కాదన్న అభిప్రాయం వైసీపీ వర్గాల్లో ఉందట. అందుకే ఆమె చేస్తున్న విమర్శలు, ఆరోపణలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని, లైట్ తీసుకోవటమే బెటరన్న అభిప్రాయం వైసీపీలో ఉన్నట్టు తెలిసింది. పురంధేశ్వరి మాటలపై ఎక్కువగా స్పందిస్తే అనవసర ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందనే చర్చ అధికార పార్టీ నేతల మధ్య జరుగుతోందట. అసలు బీజేపీ ఉనికే అంతంత మాత్రమని, అసలు ఆ పార్టీతో పోటీయే లేనప్పుడు పురంధరేశ్వరి చేసే ఆరోపణ ప్రభావం ఏమీ ఉండదని కూడా వైసీపీ నాయకులు అనుకుంటున్నట్టు తెలిసింది. మరోవైపు మహిళా కావటం కూడా ఆమె పై వైసీపీ విమర్శలు ఎక్కుపెట్టడకుండా ఉండటానికి మరో కారణం అయి ఉండవచ్చంటున్నారు. మహిళా నేతల విషయంలో ఆచితూచి జాగ్రత్తగా మాట్లాడాలన్న డైరెక్షన్ పార్టీ పెద్దల నుంచి వచ్చినట్లు టాక్. ఎన్టీఆర్ కుమార్తెగా ఆమెకు గౌరవం ఇవ్వాలని ఆమె శృతిమించి మరీ తీవ్ర స్థాయిలో ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే అప్పుడు చూసుకోవచ్చన్నది వైసీపీ ఆలోచన అట. ఆమె ఆరోపణల మోతాదు దాటితే బీజేపీ నాయకురాలిగా కంటే చంద్రబాబుతో ఉన్న కుటుంబ బంధం ఎక్కువగా ఫోకస్ అవుతుందనేది వైసీపీ వర్గాలు వేసుకుంటున్న మరో లెక్క.

## జగన్ పర్యటన.. చెట్లు నరికివేత

**జయభేరి, కాకినాడ :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో ఈనెల 26న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను అధికారులు తొలగించడం వివాదాస్పదం అవుతోంది. స్థానిక ఆర్డిఓ కార్యాలయం నుంచి బాలయోగి ఘాట్ వరకు సీఎం రూట్ మ్యాప్ ప్రకారం రోడ్డు పక్కన ఉన్న చెట్లను అధికారులు కొట్టేశారు. ముఖ్యమంత్రి ఒక్కరోజు పర్యటన కోసం పర్యావరణాన్ని కాపాడే చెట్లను నరికి వేయడం దారుణం అంటూ విపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా సీఎం హెలికాప్టర్ దిగేందుకు ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్ వద్ద ఖాళీ స్థలంలో కొబ్బరి చెట్లను నరికి హేలీప్యాడ్ సిద్ధం చేస్తున్నారు అధికారులు. అవి ముప్పై ఏళ్ల వయసు ఉన్న చెట్లని.. వాటిని కొట్టేయాల్సిన అవసరం లేదని అమలాపురం ప్రజలు అంటున్నారు. అమలాపురంలోని ఎస్ కే బీ ఆర్ కళాశాల, కిమ్స్ మెడికల్ కళాశాలలో రెండు హెలీ ప్యాడ్ లు ఉన్నప్పటికీ అవి పరిగణలోకి తీసుకోకుండా రూ. 15 లక్షలు ప్రజాధనం వెచ్చించి.. పెద్ద ఎత్తున చెట్లను కొట్టి వేసి.. కొత్త హెలీప్యాడ్ నిర్మించారన్న విమర్శలు వస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విధ్వంసానికి నిదర్శనం అని, మరోసారి అమలాపురంలో నిరూపితమవుతుందని చెట్లు నరికివేతపై జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గం ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు విమర్శలు గుప్పించారు. అమలాపురం చెట్ల నరికి వేత వీడియోలను జనసైనికులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. సీఎం పర్యటన జరిగిన రోడ్ల వెంట చెట్లు ఉండకూడదన్నట్లుగా అధికారులు అతిగా భద్రతా ఏర్పాట్ల పేరుతో పర్యవరణానికి ఇబ్బంది కలిగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

## డోలిలో 8 కిలోమీటర్లు మృతదేహం

**జయభేరి, ఏలూరు :**

తరాలు మారుతున్న తలరాతలు మారడం లేదని అంటుంది ఆ గిరిజనుల పరిస్థితి. అడవిని నమ్ముకుని కొండ కోనల్లో నివసించే అడవి బిడ్డలకు.. నిత్యం జీవన పోరాటం వెంటాడుతోంది. కనీస సౌకర్యాలు లేక.. అల్లాడిపోతున్నారు ఆ గిరిజనులు. ఎన్నికల సమయంలో చేస్తాం చూస్తామంటున్న ప్రజాప్రతినిధులు కూడా.. మొహం చాటేస్తుండడంతో ఆ గిరిజనుల కష్టాలు తీరడం లేదు. తాజాగా.. ఓ మృతదేహానికి డోలి కట్టి.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఎనిమిది కిలోమీటర్లు మోసారు. ఈ దారుణ ఘటన ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి జిల్లా లో మారుమూల ప్రాంతలో చోటు చేసుకుంది. రోగం వచ్చిన అత్యవసరమైనా.. రహదారి సౌకర్యం లేక డోలి కట్టక తప్పడం లేదు. తాజాగా మహిళ మృతదేహానికి డోలి కట్టారు గిరిజనులు. 8 కిలోమీటర్లు డోలిలో మృతదేహాన్ని మోసుకొని గ్రామానికి తరలించిన ఘటన అందరినీ కలచివేస్తుంది.జీకే వీధి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన చిలకల దేవి అనే 22 ఏళ్ల వివాహిత అనారోగ్యం బారిన పడింది. ఆమెను చింతపల్లి పీహెచ్సీ కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దేవి ప్రాణాలు కోల్పోయింది. అయితే ఆమె మృతదేహం తరలించే సమయంలో గిరిజనులకు అసలు కష్టాలు మొదలయ్యాయి.ఆసుపత్రి మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ ను ఇచ్చింది. ఎగువున కురుస్తున్న వర్షాలకు పెద్ద కాలువ నుంచి వరద నీరు ప్రవహిస్తోంది.. మరోవైపు రహదారి సౌకర్యం సరిగా లేకపోవడంతో అంబులెన్స్ ముందుకు వెళ్లలేకపోయింది. మృతదేహాన్ని తీసుకుని వాగుని ఆ డోలీతో దాటుకుంటూ దాదాపుగా ఎనిమిది కిలోమీటర్లు తీసుకుని వెళ్లారు. అతి కష్టం మీద గొల్లపల్లి వరకు మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.'ఇలాంటి ఘటనలు జరగడం ఇదే తొలిసారి కాదు.. గతంలోనూ మా కష్టాలు అనేకసార్లు వివరించాం. వర్షాలు వస్తే మాకు కష్టాలు వర్ణనాతీతం. గడ్డలు పొంగిపోతాయి. మారుమూల గ్రామాల నుంచి బయటకు వెళ్లలేం. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా మా బతుకులు మారడం లేదు. గతంలోనూ మృతదేహాలకు ఇటువంటి దుస్థితే ఎదురయింది. ఇప్పటికైనా మా గోడు విని.. రోడ్డు సౌకర్యం కల్పించి కష్టాలు తీర్చాలి' అని కోరుతున్నారు గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు.అవును.. ఈ అమాయక అడవి బిడ్డల ఓట్లతో గెలిచే నేతలకు కార్లు ఏసీలు ఫ్లైట్లు కావాలి.. కానీ ఈ గిరిజనులకు మాత్రం తాగేందుకు గుక్కడు మంచినీళ్లు, సరైన రహదార్లు మాత్రం ఉండవు. పాలకుల్లారా.. కాస్త ఆలోచించండి. ఆ అమాయక అడవి బిడ్డల కష్టాలు తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## ప్రకాశం బ్యారేజ్ కు వచ్చి చేరుతున్న వరద

**జయభేరి, అమరావతి :**

విజయవాడ ప్రకాశం బ్యారేజ్ క వరద నీరు చేరుతోంది. శనివారం ఉదయం ఇన్ ఫ్లో 17 వేల 377 క్యూసెక్కులు, కాల్వలకు : 5వేల 416 క్యూసెక్కులు నమోదయ్యాయి. అధికారులు 14 గేట్లు అడుగు మేర ఎత్తివేసారు. సముద్రంలో కి 10,290 క్యూసెక్కుల నీరు విడుదల చేసారు.

## పోటెత్తిన గోదావరి

**జయభేరి, దేవిపట్నం :**

భద్రాచలం ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు గోదావరి వరదలు పోటెత్తాయి. భద్రాచలం వద్ద ఇప్పటికే 40 అడుగులకు వరద నీరు వచ్చే చేరడంతో వచ్చిన వరద నీరుని దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. దిగువకు విడుదల చేసిన వరద నీటితో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం తోడవడంతో పోలవరం ప్రాజెక్టు వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఈ సందర్భంగా సర్పంచ్ కలుం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ గోదావరి వరద నీటితో దేవీపట్నంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన గండి పోచమ్మ ఆలయ గోపురాన్ని వరదలు తాకాయని అన్నారు. వరదలు కారణంగా పాపికొండలు విహార యాత్రకు సంబంధించిన బోట్లను కూడా తాత్కాలికంగా అధికారులు నిలిపివేశారని అన్నారు. భక్తులు కూడా ఆలయ పరిసర ప్రాంతాలకు రావద్దని మనవి చేశారు.ఈ గోదావరి వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఆలయ పున ప్రారంభ తేదీని పత్రిక ముఖంగా తెలియజేస్తామని ఆయన అన్నారు.

## సాలూరు ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్టీసీ ఎండి

**జయభేరి, పార్వతీపురం :**

సాలూరు ఆర్టీసీ డిపో ను ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు సందర్శించారు. అయన వెంట మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏ ఎస్ పి షారొన్ ఇతర అధికారులు వున్ఆనరు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ కు పోలీసులు ముందుగా గౌరవ వందనం చేస్తూ ఆయనకు ఆహ్వానం పలికారు. తరువాత అయన రాష్ట్రంలో 1500 కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు టెండర్లు పిలిచామని త్వరలోనే రాష్ట్రానికి కొత్త బస్సులు రానున్నాయని తెలిపారు. సాలూరు డిపోలో పనిచేసే ఆర్టీసీ ఉద్యోగులు వారి డ్యూటీలో నైపున్యం సాధించిన కొంతమంది ఉద్యోగులకు ప్రశంస పత్రం అందజేశారు ఈ కార్యక్రమం లో ఆర్టీసీ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న గవర్నర్ కు ఘన స్వాగతం

**జయభేరి, తిరుపతి :**

తిరుపతి జిల్లాలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ 12 వ స్నాతకోత్సవం లో కులపతి హోదాలో ముఖ్య అతిథిగా పాల్గొనుటకు నేటి శనివారం ఉదయం 09.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నగవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కి ఘన స్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ కే వెంకట రమణా రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ పద్మనాభ రెడ్డి గవర్నర్ కి ఘన స్వాగతం పలికారు. వీరితో పాటుగా లైజన్ ఆఫీసర్ భాస్కర్ నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



## పాల ట్యాంకర్ కారు ఢీ ముగ్గురు దుర్మరణం

**జయభేరి, ఒంగోలు :**

ప్రకాశం జిల్లా మార్టూరు మండలం కొనంకిలో శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగినట్టు తెలిసింది, జాతీయ రహదారి పై పాల ట్యాంకర్‌ను కారు ఢీకొట్టిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతి వేగాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. నిదానంగా ప్రయాణాలు చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలని డ్రైవర్లకు పోలీసులు సూచించారు.

## టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో చేరికలు

**జయభేరి, హైదరాబాద్ :**

మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆరెస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ లో చేరారు. వీపనగండ్ల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు యెట్టం కృష్ణయ్య, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటస్వామి, దేవినేనిపల్లి సర్పంచ్ కొండల్ రావు, బీఆరెస్ మండల నాయకులు చిదంబర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, తదితరులు కాంగ్రెస్ లో చేరారు. రేవంత్ జూబ్లీహిల్స్ నివాసంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రభాత జయభేరి jayabheridaily.com



## తంగిరాల సౌమ్యకే నందిగామ టిక్కెట్

**జయభేరి, విజయవాడ :**

ఎన్నికల కసరత్తు వేగవంతం చేసిన తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు... నియోజకవర్గాల వారీగా ఇంచార్జులతో సమావేశమవుతున్నారు.ఒక్కో ఇంచార్జి యొక్క పనితీరుపై నివేదికలు తెప్పించుకున్న చంద్రబాబు...ఆ నివేదికల ఆధారంగా వారితో వన్ టు వన్ మీటింగ్ లు నిర్వహిస్తున్నారు.పనితీరు బాగోలేని ఇంచార్జిల స్థానంలో పలువురు కొత్తవారిని నియమిస్తూ వస్తున్నారు.తాజాగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా తంగిరాల సౌమ్యను ప్రకటించారు చంద్రబాబు.తంగిరాల సౌమ్య 2019 కు ముందు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పనిచేసారు.2014 ఎన్నికల్లో తన తండ్రి ప్రభాకరరావు హఠాన్మరణంతో జరిగిన ఉప ఎన్నికల్లో తంగిరాల సౌమ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు.ఆ తర్వాత 2019 లో ఎమ్మెల్యేగా పోటీ చేసి మొండితోక జగన్మోహన్ రావుపై ఓడిపోయారు. ఓడిపోయినప్పటికీ నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజాసమస్యల పట్ల పోరాటాలు చేస్తున్నారు తంగిరాల సౌమ్య.దీంతో నివేదికల ఆధారంగా వచ్చే ఎన్నికల్లో నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థిగా సౌమ్య ఉంటుందని అధినేత చంద్రబాబు ప్రకటించారు.2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచిన మొండితోక జగన్మోహన్ రావు నియోజవకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.ఆ తర్వాత ఆయన తమ్ముడు అరుణ్ కుమార్ కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు సీఎం జగన్..ఒకే కుటుంబం నుంచి అన్నదమ్ముల్లో ఒకరు ఎమ్మెల్యేగా,మరొకరు ఎమ్మెల్సీగా ఉన్నారు..ఈ ఇద్దరినీ ఎదుర్కొని బరిలో నిలబడాలంటే సౌమ్యకు ఒకింత కష్టం తప్పదని చెప్పాలి.అయితే మొండితోక బ్రదర్స్ పై చాలా కాలంగా పోరాటాలు చేస్తున్నారు సౌమ్య.అంతెందుకు మొండితోక బ్రదర్స్ ను వసూల్ బ్రదర్స్ అంటూ కామెంట్స్ చేయడం...ఆ తర్వాత ఒకరికొకరు సవాళ్లు విసిరికోవడం...ఇలా ఎప్పటికప్పుడు నియోజకవర్గంలో పొలిటికల్ హీట్ కంటిన్యూ అవుతుంది.అయితే టీడీపీకున్న బలమైన కేడర్ తో ఖచ్చితంగా మళ్లీ పసుపు జెండా ఎగురవేస్తానంటున్నారు సౌమ్య.అటు అధికార పార్టీ నమ్ముకున్న అభివృద్ధితో మళ్లీ వైసీపీదే సీటు అంటున్నారు మొండితోక జగన్మోహన్ రావు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య జరిగిన అభివృద్ధిని చూపిస్తూ వైసీపీ ప్రజల్లోకి దూసుకెళ్తుంటే...ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల అవినీతి తన ప్రధాన అస్త్రం అంటున్నారు తంగిరాల సౌమ్య. తెలుగుదేశం పార్టీ నుంచి టిక్కెట్లు కన్ఫర్మ్ అయిన కొద్ది మందిలో తంగిరాల సౌమ్య కూడా ఒకరు.మరి తంగిరాల సౌమ్య వచ్చే ఎన్నికల్లో గెలుస్తారా...?అధఇకార పార్టీని ఢీకొంటారా అనేది చూడాలి.



## నిరవధిక సమ్మెకు విద్యుత్ ఉద్యోగులు

**జయభేరి, విశాఖపట్టణం :**

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇదివరకే టీచర్లు, ఇతర విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు పలుమార్లు సమ్మెకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ విధానంలో తమ ఆలోచనలకు భిన్నంగా నిర్ణయాలు తీసుకుందని ఉద్యోగ సంఘాలు సైతం విమర్శించాయి. తాజాగా ఏపీలో విద్యుత్ ఉద్యోగులు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. అలవెన్సులు, జీపీఎఫ్, రివైజ్డ్ పే స్కేళ్లు సహా తదితర అంశాలను పరిష్కరించకుండా జగన్ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించకోలేదని ఏపీ విద్యుత్ ఉద్యోగుల ఐకాస నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆగస్టు 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించారు. దశలవారీగా రిలే నిరాహార దీక్షలు చేయడానికి ఏపీ విద్యుత్ ఉద్యోగుల ఐకాస నేతలు పిలుపునిచ్చారు. ముందుగా జులై 27వ తేదీన భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగులు నిరసనను ప్రారంభించనున్నారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించటంలో జగన్ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని ఈ నెల 27 నుంచి విద్యుత్ సిబ్బంది నిరసనకు సిద్ధమయ్యారు. సమ్మె, ఆందోళనల నోటీసును విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యచరణ సమితి ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కోల ఎండీలకు, డిస్కంల సీఎండీలకు అందజేశారు. తొలి దశలో జులై 27 తేదీ నుంచి మొదలుపెట్టనున్న నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు ఆగస్టు 9 తేదీ వరకు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమయంలో తమ సమస్యలు పరిష్కరిస్తే నిరవధిక సమ్మెను విరమించుకుంటానమి చెప్పారు. ఆ ఆందోళనలు, నిరసనలలో రాష్ట్రంలోని అన్ని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, డివిజన్, జోనల్, ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల కార్పొరేట్ ఆఫీసులలో సేవలు అందిస్తున్న సిబ్బంది పాల్గొననున్నారు. లేనిపక్షంలో ఆగస్టు 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు స్పష్టం చేశారు. విజయవాడలోని విద్యుత్ సౌధ వద్ద ఆగస్టు 8న మహాధర్నా నిర్వహించనున్నారు. ఆగస్టు 9న సెల్ డౌన్ కార్యక్రమం నిర్వహిస్తామని, ఆరోజున సైతం వారి సమస్యలకు పరిష్కారం ప్రభుత్వం చూపనట్లయితే తమ ఆందోలన తీవ్ర రూపం దాల్చుతుందని హెచ్చరించారు. ఆగస్టు 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టి తమ సమస్యలు పరిష్కరించుకుంటామన్నారు. గతంలో పలుమార్లు చర్చలు జరిపినా యాజమాన్యాలు తమ సమస్యలకు పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెకు దిగడం తప్ప మరోక మార్గం లేదని భావించి గురువారం నోటీసులు ఇచ్చారు. సమ్మెతో సమస్యలు వస్తాయని, పరిశ్రమలు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని చర్చల ద్వారా పరిష్కరించడం సరైన విధానమని విద్యుత్ ఉద్యోగుల ఐకాస చెబుతోంది.

## సీబీఎస్ఈ కీలక నిర్ణయం
# ఇకపై ప్రాంతీయ భాషలో బోధన

**జయభేరి, న్యూఢిల్లీ :**




మానవుని జీవితంలో విద్య ఎంతో ప్రదానమైంది. విద్యతోనే మానిషి జీవితంలో ఎదగ గలడు. చదువుకోవాలంటే ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ కోసం చూస్తుంటారు.. తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలోనే వేయాలని చూస్తారు. అలా మంచి పేరున్న ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చేర్పించడానికి ప్రయత్నం చేస్తారు. ఇక సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూల్స్ లో సీటు కోసం చూస్తుంటారు. అయితే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ వాటిల్లో కేవలం ఇంగ్లీష్ మీడియంలోనే విద్య కొనసాగుతుంటుంది. తమ మాతృభాషలో విద్యను కొనసాగించలేకపోతారు. ఈ నేపథ్యంలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఎవరు తమకు నచ్చిన భాషలో బోధనా మధ్యామాన్ని ఎంచుకొనేలా నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు తమకు నచ్చిన భారతీయ భాషలను బోధనా మాధ్యమంగా ఎంచుకునేందుకు సీబీఎస్ఈ పాఠశాలలకు అనుమతించింది.జాతీయ విద్యావిధానం పాలసీని ప్రోత్సహించే విధంగా సీబీఎస్ఈ బోర్డు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు తమకు నచ్చిన భారతీయ భాషలను బోధనా మాధ్యమంగా ఎంచుకునేందుకు సీబీఎస్ఈ పాఠశాలలకు అనుమతించింది. ప్రస్తుతం మెజారిటీ సీబీఎస్ఈ పాఠశాల్లలో ఆంగ్లంలో బోధిస్తుండగా కొన్ని పాఠశాల్లలో మాత్రమే హిందీలో బోధన సాగుతోంది. ఇప్పటి వరకు సీబీఎస్ఈ పాఠశాల్లలో భారతీయ భాషల్లో బోధించేందుకు అనుమతి లేదు. తాజా ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలు తమకు నచ్చిన భారతీయ భాషల్లో బోధనను కొనసాగించవచ్చు. ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(UGC) ఉన్నత విద్యలో సైతం మాతృభాషల్లో బోధించేందుకు ఇలాంటి ఉత్తర్వులనే జారీ చేసింది. ఇదొక చరిత్రాత్మక నిర్ణయమని జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ ఆధీనంలో పనిచేసే భారతీయ భాషా సమితి అధ్యక్షుడు చాము కృష్ణ శాస్త్రి అన్నారు. ఈ నిర్ణయంతో బోధన, అభ్యాసరీతులు భారతీయీకరణం చెందడంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు వస్తాయన్నారు. వృత్తిపరమైన విద్యలో ప్రాంతీయ భాషలను యూజీసీ అందుబాటులోకి తేగా, ఇప్పుడు పాఠశాల స్థాయిల్లో స్థానిక భాషలను ఐచ్ఛికంగా ఎంచుకునేందుకు సీబీఎస్ఈ ఈ అవకాశం కల్పించిందని అన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని ముందుకు తీసుకెళ్లడంలో ఈ నిర్ణయం ఎంతో ముఖ్యపాత్ర వహిస్తుందని అన్నారు. ప్రాథమిక పాఠశాలల నుంచి పీయూసీ వరకు అన్ని పాఠశాలల్లో భారతీయ భాషలను బోధనా మాధ్యమంగా ఉపయోగించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆదేశించింది. ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమైనదని అని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) లో ఊహించినట్లుగా పాఠశాలల్లో భారతీయ భాషా ఆధారిత విద్యను ప్రోత్సహిస్తుందని ఆయన చెప్పారు.దీనిపై ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్ చేస్తూ, పాఠశాలల్లో మాతృభాష, భాషలలో విద్యను ప్రోత్సహించే దిశగా ఇది ప్రశంసనీయమైనదని అన్నారు. పాఠశాలలన్నింటిలో ప్రాథమిక నుంచి పన్నెండవ తరగతి వరకు భారతీయ భాషలలో విద్యను అందించే ఎంపికను అందించినందుకు సీబీఎస్ఈని నేను అభినందిస్తున్నాను. ఎన్ఈపీ ద్వారా ఊహించిన విధంగా ఇది పాఠశాలల్లో భారతీయ భాషా ఆధారిత విద్యను ప్రోత్సహిస్తుంది. విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇది శుభారంభం' అని ఆయన పేర్కొన్నారు.

# కిషన్ రెడ్డి నియామకంతో సమస్యలు

**జయభేరి, హైదరాబాద్ :**



తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి మరోసారి బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ కార్యక్రమం వేదికగా జరిగిన పరిణామాలు చూస్తూంటే బీజేపీలో పరిస్థితులు ఏ మాత్రం సద్దుమణగకపోగా.. మరింతగా ముదిరాయన్న అభిప్రాయం అందరికీ కలగడం సహజమే. చాలా మంది నేతలు పార్టీలో అంతర్గత విషయాలనే ఈ కార్యక్రమంలో ప్రస్తావించారు. ప్రభుత్వంపై విమర్శలు చేసినప్పటికీ సహజంగా ఇవే హైలెట్ అయ్యాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బండి సంజయ్ లతో పాటు విజయశాంతి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. కొంతమంది తీరుతో మరికొంత మందిఅ అసంతృప్తికి గురయ్యారన్న ప్రచారంమూ ఉపందుకుంది. కొంత మంది నేతలు అసలు ఈ కార్యక్రమానికే హాజరు కాలేదు. పార్టీ కోసం అవిశ్రాంతంగా కష్టపడిన తనకు అన్యాయం జరిగిందని బండి సంజయ్ మనసులో ఉందని..తనపై కొంత మంది లేని పోని ఫిర్యాదులు చేశారని ఆయన మనసులో ఉంది. దీన్ని నేరుగా కిషన్ రెడ్డి ప్రమాణ స్వీకార వేడుక సందర్భంగా చేసిన ప్రసంగంలో వెల్లడించారు. నేతలు పత్రికల్లో కనిపిస్తారని.. వారికి ప్రజల్లో పలుకుబడి ఉండదన్నారు. ప్రజల్లోకి వెళ్లాలని సలహా ఇచ్చారు. అదే సమయంలో తనపై లేనిపోని ఫిర్యాదులు చేస్తూ..తరచూ ఢిల్లీ వెళ్లేవారని.. ఇప్పుడు కనీసం కిషన్ రెడ్డిని అయినా ప్రశాంతంగా పని చేసుకోనివ్వాలని సలహా ఇచ్చారు. బండి సంజయ్ ఎవరిని ఉద్దేశించి అన్నారో వారంతా వేదికపైనే ఉన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై అంతర్గతంగా విస్తృత చర్చ జరుగుతోంది. ఇక ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన విజయశాంతి మధ్యలోనే వెళ్లిపోయారు. కనీసం మాట్లాడలేదు. ఎవరూ పట్టించుకోకపోవడంతోనే ఆమె వెళ్లిపోయారన్న ప్రచారం జరిగింది. కానీ తర్వాత తెలంగాణ వ్యతిరేకులు వచ్చారని.. వారు ఉన్నందువల్ల ఎక్కువ సేపు ఉండలేకపోయానని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి గురించి ఆమె ఇలా పెట్టారని చెబుతున్నారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించి సమైక్యాంధ్ర పార్టీ పెట్టుకున్నారు. తర్వతా కాంగ్రెస్ లో మళ్లీ ఇప్పుడు బీజేపీలో చేరారు.

అయితే ఇప్పుడు తెలంగాణ కార్యక్రమానికి ఆయన రావడాన్ని రాములమ్మ వ్యతిరేకించారు. రాములమ్మ ఓ కారణం మాత్రమే చెప్పారని... ఆమెకు గుర్తింపు లేదనే అసంతృప్తితోనే వెళ్లిపోయారని అంటున్నారు. కాంగ్రెస్ లో ప్రచార కమిటీ చైర్మన్ పదవిని వదులుకుని బీజేపీలోకి వస్తే..కనీసం పోటీ చేయడానికి ఓ నియోజకవర్గాన్ని కూడా ఇంక ఖరారు చేయలేదన్న అసంతృప్తిలో ఉన్నారని అంటున్నారు. కిషన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి హాజరైన వారి మధ్య వివాదాలు ఏర్పడగా.. అసలు కార్యక్రమానికే రాని వాళ్లు ఉన్నారు. యెన్నం శ్రీనివాసరెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ , ఏనుగు రవీందర్ రెడ్డి వంటి వారు హాజరు కాలేదు. వారంతా పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతోంది. రానివారు.. వచ్చిన వారి మధ్య అసంతృప్తిని తక్కువగా వేయలేమని బీజేపీ వర్గాలంటున్నాయి. బీజేపీలో జరిగే పరిణామాలను అంచనా వేయడం కష్టమన్న వాదన వినిపిస్తోంది.

ఈ కొద్ది కాలంలో మొత్తం పార్టీ సిస్టమ్ ను యాక్టివ్ చేసి.. ఎన్నికలకు సిద్ధం చేయడం అంత సామాన్యమైన విషయం కాదు. నేతల్లో అసంతృప్తిని.. వర్గాలను సమన్వయం చేసుకుని.. చేసిన తప్పిదాల నుంచి బయట పడాలంటే.. కత్తి మీద సాము చేయాల్సిందేన్న బావన వ్యక్తమవుతోంది.

## త్వరలో కైలాష్ యాత్రకు

**జయభేరి, న్యూఢిల్లీ :**

టిబెట్ పీఠభూమిలో కొలువుదీరిన మౌంట్ కైలాష్ ప్రాంతాన్ని శివుని నివాస స్థలంగా భావిస్తారు. అయితే ఈ ప్రాంతానికి ఇండియా నుంచి భక్తులు సందర్శించేందుకు త్వరలోనే అనుమతి లభించనుంది. ఈ విషయాన్ని బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ అధికారులు వెల్లడించారు. ఇండియా - చైనా సరిహద్దు ప్రాంతంలోని పిథోరాఘర్ జిల్లా నబిధాంగ్ నుంచి లిపులేక్ పాస్ వరకు రోడ్ కట్టింగ్ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దాదాపు ఆరున్నర కిలోమీటర్ల వరకు ఈ పనులు జరుగుతున్నాయని చెప్పారు. సెప్టెంబర్ నాటికి ఇవి పూర్తయితే భక్తలు సందర్శన కోసం మౌంట్ కైలాష్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా కైలాష్ - మానసరోవర్ యాత్ర కరోనా మహమ్మరి వల్ల ఆగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ యాత్రను ప్రారంభించలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఈ యాత్రను ప్రారంభించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. వాతావరణం అనుకూలిస్తే సెప్టెంబర్ నాటికే రోడ్ కట్టింగ్ పనులు పూర్తవుతాయని బీఆర్‌వో చీఫ్ ఇంజనీర్ విమల్ గోస్వామి తెలిపారు. ఇదిలా ఉండగా శివుని నివాస స్థలంగా భావించే మౌంట్ కైలాష్ ప్రాంతాన్ని దర్శించుకోవాలని ఎంతోమంది భక్తులు కోరుకుంటారు. త్వరలోనే అక్కడికి వెళ్లేందుకు అనుమతి లభించడంతో శివభక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఆ ఊళ్లో మద్యం షాపులు బంద్

**జయభేరి, నల్గొండ :**

సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధ్యమే. యువతను పెడదారి పట్టిస్తూ ఒళ్ళు, ఇళ్లను గుల్ల చేస్తున్న మద్యాన్ని కట్టడి చేయాలని ఇక్కడి గ్రామస్తులు నడుం బిగించారు. గ్రామంలోని బెల్ట్ షాపుల భరతం పట్టాలని సంకల్పించారు. ఇందుకోసం.. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గ్రామస్తులు మద్యపానం నిషేధిస్తూ తీర్మానం చేశారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగు దశాబ్దాలుగా సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని కొనసాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ఇక్కడి గ్రామస్తులు. ఆదర్శ గ్రామమేదో మనం కూడా తెలుసుకుందాం..సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గ్రామం తమరబండ పాలెం. 800 గ్రామ జనాభా ఉంది. ఇక్కడి వారంతా వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నాలుగు దశాబ్దాల కిందట దసరా పండుగ రోజూ ఇద్దరూ వ్యక్తులు మద్యం తాగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణ కుటుంబాల మధ్య చిచ్చుకు దారితీసి గ్రామంలో అశాంతి నెలకొంది. నాటి గ్రామ పెద్దలు.. గ్రామం బాగుండాలి అంటే ఊరిలో సారా, మద్యం అమ్మకూడదు, తాగకూడదని నిర్ణయించారు. నాటి నుంచి మద్యం తాగినా, అమ్మినా జరిమానా విధించాలని గ్రామస్తులు కట్టుబాటు చేసుకున్నారు. గ్రామ కట్టుబాటును ధిక్కరిస్తే రూ. 5 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని గ్రామస్తులంతా బాండ్ పేపర్ పై రాసి సంతకాలు చేశారు.అయితే గతంలో ఓసారి ఇద్దరూ, ముగ్గురు వ్యక్తులు గ్రామ కట్టుబాటుకు వ్యతిరేకంగా బెల్ట్ షాపులను తెరిచారు. గ్రామ పెద్దలు మందలించినా.. బెల్ట్ షాపులను కొనసాగించారు. ఎవరూ మద్యాన్ని కొనకపోయేసరికి చేసేదేమి లేక వారు స్వచ్ఛందంగా బెల్ట్ షాపును మూసేశారు. ఎవరైనా మద్యం తాగాలనుకున్నా.. బంధువులు వచ్చిన.. సమీపంలోని కోదాడ పట్టణానికి వెళ్లాల్సిందే. మద్యానికి వ్యతిరేకంగా నాటి పెద్దలు విధించిన సంపూర్ణ మద్యపానం నిషేధాన్ని నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తూ ఈ గ్రామం అందరికీ ఆదర్శంగా నిలిచింది.

# ఏఐ కోర్సులకు కేంద్రం శ్రీకారం



**జయభేరి, ముంబై :**

కేంద్రప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇండియా 2.0 లో భాగంగా ఉచిత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్AI కోర్సును ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు. స్కిల్ ఇండియా, జీయూవీఐ మధ్య పరస్పర సహకారంతో ఈ కార్యక్రమానికి రూపొందించారు. తెలుగుతోపాటు.. తమిళం, కన్నడ, మలయాళం, ఒడియా, మరాఠీ, గుజరాతీ, హిందీతోపాటు ఇంగ్లిష్‌లో ఈ కోర్సును అందుబాటులో తీసుకొచ్చారు. ఈ కోర్సు పట్ల ఆసక్తి ఉన్నవారు ఆగస్టు 14 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తు గడువు ముగిసిన తర్వాత కోర్సును ప్రారంభిస్తారు. ఆన్‌లైన్ విధానంలోనే బోధన ఉంటుంది. ఈ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు 'నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీవీఈటీ)', ఐఐటీ మద్రాస్ గుర్తింపు కూడా దక్కించుకుంది. ఐఐటీ మద్రాస్, ఐఐఎం అహ్మదాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నడిచే ప్రముఖ ఎడ్‌టెక్ కంపెనీ జీయూవీ.. పర్సనలైజ్డ్ లెర్నింగ్ సొల్యూషన్స్ విభాగాల్లో అగ్రగామిగా ఉంది. ఈ కంపెనీ వివిధ ప్రాంతీయ భాషల్లో సాంకేతిక నైపుణ్యాలను బోధించడం, ఆన్‌లైన్ లెర్నింగ్, అప్‌స్కిల్లింగ్, రిక్రూట్‌మెంట్ అవకాశాల వంటి సేవలను అందిస్తోంది. ముఖ్యంగా ప్రాంతీయ భాషాల్లో టెక్ స్కిల్స్ బోధించడంలో ముందంజలో ఉంది.గతంలో ప్రోగ్రామింగ్ చేయకపోయినా, బేసిక్ సింటాక్స్ తెలిసినా లేదా పైథాన్ అధునాతన ఫీచర్ల గురించి తెలుసుకోవాలనుకునే ఆసక్తి ఉన్నవారు ఈ కోర్సులో చేరవచ్చు. ఈ కోర్సు మీకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, పైథాన్‌ల ఓవర్ వ్యూను అందిస్తోంది. ఈ కోర్సు ద్వారా కంపెనీలు కోరుకునే పైథాన్ ప్రోగ్రామింగ్, ఏఐ నైపుణ్యాలను పొందేందుకు అవకాశం కలుగుతుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక విద్యను ప్రతి ఒక్కరికి అందించడానికి ముఖ్యంగా.. గ్రామీణ యువతలో సాధికారత కల్పించే లక్ష్యంతో ఏఐఫర్ఇండియా 2.0 కోర్సుకు రూపకల్పన చేశారు. ఈ ఉచిత ఏఐ కోర్సులో ప్రవేశాలు కోరేవారు GUVI అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుది. సైనప్ చేసే సమయంలో మీకు జావా, కోడింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇతర విషయాలపై ఏమైనా అవగాహన ఉందా అని అడుగుతారు. కానీ ఇవేమీ రాకపోయినా ఏఐ ప్రాగ్రామింగ్ నాలెడ్జ్ కావాలనుకునే వారు కోర్సు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అభ్యర్థులు మొదట అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.భారతీయ ప్రాంతీయ భాషలలో సాంకేతిక కోర్సులను అందించాల్సిన ఆవశ్యకతను కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నొక్కి చెప్పారు. సాంకేతిక విద్యలో భాషాపరమైన అవరోధాలను ఛేదించడం అత్యంత ముఖ్యమని, దేశంలోని యువతను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని భవిష్యత్తుకు కీలకమైన ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తు మొత్తం ఏఐ దే ఇప్పటికే విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రపంచంలోని దిగ్గజ సంస్థలన్నీ ఈ రంగంలో పెట్టుబడులు పెంచుతున్నాయి. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కూడా ఇటీవలే ఏఐ స్టార్టప్ ను ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# యంగ్ ఇండియా.. బంగ్లా క్రికెటర్ల మధ్య గొడవ

శ్రీలంక వేదికగా జరుగుతున్న ఏసీసీ ఎమర్జింగ్ ఆసియాకప్ లో యువ భారత జట్టు ఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో యంగ్ఇండియా 51 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‘ఎ’ ను చిత్తుచేసింది. దీంతో ఇండియాఎ జట్టు ఫైనల్ లోకి ప్రవేశించింది. ఈ మ్యాచ్‌లో భాగంగా ఇండియాఎ, బంగ్లాదేశ్ఎ ఆటగాళ్ల మధ్య గొడవ జరిగింది. ఇండియాఎ బౌలర్ యువరాజ్ సిన్హ్ దోడియా బౌలింగులో నికిన్ జోస్‌కు క్యాచ్ ఇచ్చి బంగ్లా బ్యాటర్ సౌమ్య సర్కార్ అవుటయ్యాడు. దీంతో భారత ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో సౌమ్య సర్కార్‌కు.. హర్షిత్ రాణాకు మధ్య గొడవ మొదలైంది. ఇద్దరి మధ్య మాట మాట పెరిగి మైదానంలో ఇది తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో అంపైర్, ఇతర ఆటగాళ్లు కలుగ చేసుకుని గొడవను సద్దుమణిగించారు. ప్రస్తుతం ఈ గొడవకు సంబంధించిన వీడియో వైరల్ అవుతుంది. అంతకుముందు యష్ ధుల్ కెప్టెన్ (66) ఇన్నింగ్స్‌తో జట్టును ముందుకు నడపడంతో ఎమర్జింగ్ ఆసియాకప్‌లో యువ భారత జట్టు ఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో యంగ్ఇండియా 51 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‘ఎ’ను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్‘ఎ’ 49.1 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను 34.2 ఓవర్లలో 160 పరుగులకు భారత జట్టు ఆలౌట్ చేసింది. ఇక ఆదివారం కొలంబోలో జరుగనున్న ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో భారత్ ఫైనల్లో తలపడనుంది.






# భారత్, బంగ్లా చివరి వన్డే ‘టై’

భారత్, బంగ్లాదేశ్ మహిళల జట్ల మధ్య జరిగిన మూడో వన్డే ‘టై’గా ముగిసింది. ఇరు జట్ల స్కోర్లు సమం కావడంతో మ్యాచ్ ‘టై’ కాగా.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు జట్లూ ఒక్కో మ్యాచ్ నెగ్గడంతో సిరీస్ సమమైంది. మొదట బంగ్లా 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఓపెనర్ ఫర్జానా హక్ (107) సెంచరీతో రాణించగా.. షమీమా సుల్తానా (52) హాఫ్‌సెంచరీతో ఆకట్టుకుంది. భారత బౌలర్లలో స్నేహ్‌రాణా 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 49.3 ఓవర్లలో సరిగ్గా 225 పరుగులకు ఆలౌటైంది. స్టార్ ఓపెనర్ స్మృతి మందన (59), హర్లీన్ డియోల్ (77) అర్ధశతకాలు సాధించారు. ఒక దశలో 212/6తో విజయానికి చేరువైన టీమ్‌ఇండియా.. 19 బంతుల్లో 10 పరుగులు చేయలేక చివరకు మ్యాచ్‌ను ‘టై’గా ముగించింది. జెమీమా రోడ్రిగ్స్ (33 నాటౌట్) క్రీజులో ఉన్నా ఫలితం లేకపోయింది. కాగా.. కెప్టెన్ హర్మన్(14) ఔటైన తీరు వివాదాస్పదమైంది. మ్యాచ్ అనంతరం హర్మన్ స్పందిస్తూ ఈ టూర్‌లో అంపైరింగ్ తీరు పూర్తిగా నిరాశ పరిచిందని పేర్కొంది.



# పోలీసు ప్లేయర్లకు నగదు ప్రోత్సాహకాలు

**జయభేరి, హైదరాబాద్:**

జాతీయస్థాయిలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన 33 మంది పోలీస్ అధికారులకు డీజీపీ అంజనీకుమార్ శనివారం తన కార్యాలయంలో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. 2018 నుంచి 2023 వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్, బ్యాడ్మింటన్, వాటర్ స్పోర్ట్స్, వాలీబాల్, రెజ్లింగ్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ వంటి విభాగాల్లో.. స్వర్ణ పతకం సాధించిన వారికి 3 లక్షలు, రజత పతకానికి 2 లక్షలు, కాంస్య పతకానికి లక్ష చెకులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీలు అభిలాష బిస్త్, శిఖాగోయెల్, మహేశ్ భగవత్, సౌమ్యమిశ్రా, ఐజీ షానవాజ్ ఖాసీం పాల్గొన్నారు.

# టైటిల్‌కు అడుగు దూరంలో..



భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి.. కొరియా ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నీ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్‌చిరాగ్ జంట 2115, 2422తో రెండో సీడ్ లియాంగ్‌వాంగ్ చాంగ్ (చైనా) ద్వయంపై గెలుపొందింది. గత నెలలో ఇండోనేషియా సూపర్ 1000 టైటిల్ నెగ్గిన అనంతరం బరిలోకి దిగిన తొలి టోర్నీలోనే మనవాళ్లు దుమ్మురేపారు. 40 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రపంచ మూడో ర్యాంక్ జోడీ వరుస గేమ్‌ల్లో ప్రత్యర్థిని మట్టకరిపించింది.

తెలుగు కుర్రాడు సాత్విక్ తన సూపర్ స్మాష్‌లతో సత్తాచాటాడు. ఆదివారం జరుగనున్న ఫైనల్లో ఫజర్ అల్ఫాన్ రియాన్ జంటతో భారత జోడీ అమీతుమీ తేల్చుకోనుంది.

# పొంగులేటి ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరికలు

**జయభేరి, అశ్వరావుపేట :**

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అశ్వారావుపేట పట్టణంలోని సత్యసాయి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా పలు పార్టీల నుండి వందలాదిమంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వారావు పేట నియోజకవర్గంలో ఖమ్మం మాజీ ఎంపీ కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల నుండి పలు కుటుంబాలు కాంగ్రెస్ లో జాయిన్ అయ్యారు.స్థానిక సత్యసాయి కళ్యాణ మండపంలో జరిగిన చేరికల సమావేశం వందలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలతో జనసంద్రంగా మారింది. చేరికల అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఈనెల ఖమ్మంలో జరిగిన కాంగ్రెస్ జనగర్జన సమావేశం రాష్ట్ర రాజకీయ సమీకరణాలను మార్చిందని అన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం సభను విజయవంతం కాకుండా చేసేందుకు విఫలయత్నం చేశారని అన్నారు.ప్రభుత్వం,పోలీసులు ఎన్ని అడ్డంకులు పెట్టినా తన సభను విజయవంతం చేసిన తన అనుచరులకు కృతజ్ఞతలు తెలిపారు. బంగారు తెలంగాణ సాధిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ ప్రజలను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టారని విమర్శించారు.తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాలను కానుకగా ఇవ్వాలని ఆయన అన్నారు. ఒకప్పుడు శ్రీనివారెడ్డి కొందరికి నాయకుడని కాంగ్రెస్ లో చేరాక ఇప్పుడు అందరివాడయ్యాడాని,పాత కొత్త కార్యకర్తలు అందరూ కలివిడిగా కలిసి పనిచేయాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతున్నారని,నాయకులు అలుపు లేకుండా పోరాడి రాష్ట్రంలో కాంగ్రెస్ ని అధికారంలోకి తెస్తే,తెలంగాణలో రామరాజ్యం ఏర్పాటు చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ లో ఒకటే గ్రూప్ ఉందని అది రాహుల్ గాంధీ గ్రూప్ అని ఆయన అన్నారు.మైనార్టీలకు మేలు జరిగింది కేవలం కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అని,కులమతాలకు అతీతంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని అన్నారు.బీజేపీ కి బీఆర్ఎస్ బీ టీమ్ అని,బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలు బయటకు కొట్టుకున్నట్టు నటించినా లోపల ఇద్దరూ ఒకటే అని విమర్శించారు.కాంగ్రెస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని,ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి జరిగినా తానే ప్రత్యక్షంగా వచ్చి కార్యకర్తలకు అండగా నిలుస్తానని ఆయన కార్యకర్తలకు అభయం ఇచ్చారు.కొంతమంది పోలీస్ అధికారులు ప్రభుత్వానికి తాబేదార్లుగా పనిచేస్తున్నారని,అధికారం ఎవడి సొత్తు కాదని,4 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని,తమ ప్రభుత్వం వచ్చాక కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులను గుర్తుపెట్టుకొని మరీ తరిమికొడతామని ఆయన హెచ్చరించారు.



# 24న పొంచి ఉన్న మరో అల్ప పీడనం

## తెలుగు రాష్ట్రాలకు భారత వాతావరణ విభాగం హై అలెర్ట్ పలు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలెర్ట్

**జయభేరి, హైదరాబాద్ :**

ఇప్పటికే తెలుగు రాష్ట్రాలను వర్షాలు ముంచెత్తుతున్నాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ క్రమంలోనే భారత వాతావరణ విభాగం (IMD) మరో పిడుగు లాంటి వార్తను అందించింది. తెలుగు రాష్ట్రాలకు హై అలెర్ట్ ప్రకటించింది. నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలెర్ట్ ప్రకటించింది. ఈ నెల 24న మరో అల్ప పీడనం పొంచి ఉందని తెలిపింది. రాబోయే ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి, మెదక్‌లలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. తెలుగు రాష్ట్రాల్లో నాలుగు రోజుల నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. పలు గ్రామాల్లో లో లెవల్ వంతెనలపై వరదనీరు పొంగి పోర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నదులన్నీ ఉప్పొంగుతున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టుల్లోకి ఎగువ నుంచి పెద్దమొత్తంలో వరద పొటెత్తుతున్న కారణంగా ఆ ప్రాజెక్టుల పరిస్థితి టెన్షన్‌గా మారుతోంది. అయితే గోదావరి నది మాత్రం కాస్త తగ్గుముఖం పట్టింది. ఇంతలోనే మళ్లీ వర్ష సూచన. కాగా.. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు కారణం క్యుములోనింబస్ మేఘాలు. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో పాటు చాలా ఫాస్ట్‌గా కదులుతూ ఉంటాయి. వీటి వల్ల ఇంకో ఇబ్బంది ఏంటంటే.. ఉరుములు, మెరుపులు ఎక్కువగా వస్తూ ఉంటాయి. పిడుగు పాటుకు అవకాశం ఎక్కువ. దీంతో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

# అమెరికాలో బియ్యం కోసం ఎగబడ్డ ఎన్నారైలు..


**జయభేరి, న్యూ డిల్లీ :**

బాస్మతీయేతర బియ్యం ఎగుమతిపై కేంద్ర ప్రభుత్వం గురువారం నిషేధం విధించిన నేపథ్యంలో అమెరికాలో తెలుగు ప్రజలు తీవ్ర తంటాలు పడుతున్నారు. బియ్యం కొనేందుకు పలు షాపుల వద్ద ఎన్నారైలు క్యూ కట్టారు. కొన్ని చోట్ల అయితే బియ్యం కోసం ఎన్నారైలు ఎగబడ్డారు. ఒకేసారి పదుల సంఖ్యలో బియ్యం బ్యాగులు కొనుగోలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. బియ్యం ఎగుమతులపై భారత ప్రభుత్వం నిషేధం ఎప్పుడు ఎత్తేస్తుందోనన్న భయంతో అవసరానికి మించి కూడా కొందరు ఎన్నారైలు బియ్యం కొనుగోలు చేయడంతో ఈ పరిస్థితి దాపురించింది.ఈ పరిస్థితిని గమనించిన దుకాణదారులు ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు. ఒక్కరికి ఒక్క బియ్యం బ్యాగ్ మాత్రమే విక్రయిస్తామని బోర్డుల్లో రాసిపెట్టారు. 15 డాలర్ల విలువ చేసే కిరాణ సామాన్లు కొంటేనే బియ్యం బ్యాగు కొనుగోలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక కస్టమర్‌ను ఒక్కసారి మాత్రమే షాపులోకి అనుమతిస్తామని చెప్పారు. సోనా మసూరిలో ఏ రకం బియ్యం తీసుకున్నా.. ఒక్క కుటుంబానికి ఒక్క బియ్యం బస్తా మాత్రమే విక్రయిస్తామన్నారు. బాస్మతీయేతర బియ్యం ఎగుమతిపై కేంద్ర ప్రభుత్వం గురువారం నిషేధం విధించింది. పండగలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నది. దేశీయంగా సరఫరాను పెంచే లక్ష్యంతో నిర్ణయం తీసుకోగా.. రిటైల్ ధరలు అదుపులో ఉండనున్నాయి. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నోటిఫికేషన్ జారీ చేసింది. బాస్మతియేతర ఉస్నా బియ్యం, బాస్మతి బియ్యం ఎగుమతి విధానంలో ఎలాంటి మార్పు ఉండదు. దేశం నుంచి ఎగుమతి అవుతున్న మొత్తం బియ్యంలో బాస్మతీయేతర బియ్యం వాటా 25శాతం.202223 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం నుంచి సన్న బియ్యం మొత్తం ఎగుమతి 4.2 మిలియన్ల డాలర్లకు చేరువలో ఉన్నది. అంతకుముందు సంవత్సరంలో ఎగుమతులు 26.2 మిలియన్లు డాలర్లుగా ఉండేది. భారతదేశం ప్రధానంగా థాయ్‌లాండ్, ఇటలీ, స్పెయిన్, శ్రీలంక, అమెరికాకు సన్న బియ్యాన్ని ఎగుమతి చేస్తుంది. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది వర్షాల కారణంగా పలు రాష్ట్రాల్లో ఖరీఫ్‌లో పంటల ఉత్పత్తి తగ్గింది. ప్రస్తుతం మార్కెట్ లో బియ్యం ధరలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో బియ్యాన్ని కొద్దిరోజుల పాటు నిషేధించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తున్నది. మరో ఇప్పటికే టమాట, పచ్చిమిర్చి సహా పలు కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి.

# బ్యాంక్ ను ముట్టడించిన ద్వాక్రా మహిళలు

**జయభేరి, ఏలూరు :**

యూనియన్ బ్యాంకులో డ్వాక్రా మహిళల సొమ్ము బిజినెస్ కరస్పాండెంట్ స్వాహా చేయడంతో డ్వాక్రా మహిళలు బ్యాంకుని ముట్టడింMEKI. ఆగిరిపల్లి మండలం సగ్గూరు, నర్సింగపాలెం,తోటపల్లి గ్రామాల్లో రూ.1కోటి 10 లక్షల డ్వాక్రా సంఘాల సొమ్మును యూనియన్ బ్యాంకు బి.సి.(బిజినెస్ కరస్పాండెంట్) స్వాహా చేసినట్లు ఆరోపణ. బాధిత డ్వాక్రా సంఘాల మహిళలతో కలసి ఆగిరిపల్లి యూనియన్ బ్యాంక్ ని ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ముట్టడించారు. మూడు గ్రామాల్లో రూ.కోటి రూపాయలకు పైగా డ్వాక్రా మహిళల సొమ్ము స్వాహా జరిగినట్లు నిర్ధారణ అయింది. ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు తో యూనియన్ బ్యాంక్ ఏ.జి.ఎం. హరీష్‌చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు బ్యాంకు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. పది రోజుల్లో స్వాహా అయిన సొమ్మును మహిళల ఖాతాల్లో జమ చేస్తామని బ్యాంక్ ఉన్నతాధికారులు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు.



# ప్రమాదపు అంచున హుసేన్ సాగర్

**జయభేరి, హైదరాబాద్ :**

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టుల్లో పెద్ద ఎత్తున వరద నీరు చేరుతోంది. భారీ వరదతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఇన్‌ఫ్లో అధికంగా వస్తుండటంతో ఆయా ప్రాజెక్టుల గేట్లను అధికారులు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌లోని జంట జలాశయాలకు వరద పోటు అధికంగా ఉంది. హుస్సేన్ సాగర్ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. తీవ్రస్థాయిలో హుస్సేన్‌సాగర్‌కు వరద తీవ్రస్థాయిలో పోటెత్తుతోంది. ఎడతెరిపిలేని వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్‌సాగర్‌కు వరద పోటెత్తుతోంది. బంజారా, పికెట్, కూకట్‌పల్లి నాళాల నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి 40 వేల క్యూసెక్కుల వరద వచ్చిచేరుతోంది. హుస్సెనసాగర్‌లో నీటి మట్టం ఫుల్‌ట్యాంక్ లెవెల్ దాటింది. హుస్సేన్‌సాగర్ ప్రస్తుత నీటి మట్టం 513.62 మీటర్లుగా ఉంది. అలాగే హుస్సెన్‌సాగర్ ఫుల్‌ట్యాంక్ లెవెల్ 513.41 మీటర్లుగా ఉంది. తూముల ద్వారా హుస్సేన్‌సాగర్ నుంచి 5800 క్యూసెక్కుల నీటిని మూసిలోకి అధికారులు విడుదల చేస్తున్నారు. దీంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలను జీహెచ్‌ఎంసీ అప్రమత్తం చేసింది. అలాగూ ఉస్మాన్‌సాగర్‌కు కూడా వదర తాకిది అధికంగా ఉంది. ఉస్మాన్‌సాగర్ ఇన్ ఫ్లో 800 క్యూసెక్కులుగా నమోదు అయ్యింది. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 1785.65 అడుగులకు చేరింది. మరోవైపు తెలంగాణలోని పలు జిల్లాలో ఐఎండీ (IMD) రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈనెల 24న మరో అల్ప పీడనం ఏర్పడనుందని.. రాబోయే ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి మెదక్‌లలో భారీగా వర్షాలు.

## లియోకు పోటీగా బాలయ్య భగవంత్ కేసరి..!

నరికినా కొద్ది నీకు ఆయసం వస్తుందేమో.. నాకు ఊపొస్తుంది అంటూ బాలయ్య చెప్పిన డైలాగ్ అయనకే పర్‌ఫెక్ట్‌గా సెట్ అయింది. ఏజ్ అయిన కొద్ది మరింత ఊపుతో బాలయ్య సినిమాలు చేస్తున్నాడు. పైగా తన ఏజ్ తగ్గ పాత్రలు ఎంచుకుంటూ బ్యాక్ టు బ్యాక్ బంపర్ హిట్లతో చెలరేగిపోతున్నాడు. ఒకప్పుడు యాభై కోట్ల మార్క్ టచ్ చేయడానికి నానా కష్టాలు పడే బాలయ్య ఇప్పుడు తొలిరోజే యాభై కోట్ల రేంజ్‌లో వసూళ్లు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నాడు. ఇక ప్రస్తుతం బాలయ్య భగవంత్ కేసరి అనే యాక్షన్ ఫ్యామిలీ డ్రామా చేస్తున్నాడు. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు, టీజర్ గ్లింప్స్ వీర లెవల్లో ఉన్నాయి. ఇక ఇదిలా ఉంటే తాజాగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన బిగ్ అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ సినిమాను అక్టోబర్ 19న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఓ స్పెషల్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. చేతిలో రెండు పవర్ ఫుల్ గన్స్ పట్టుకుని ప్రత్యర్ధులను మట్టు పెడుతున్నట్లు పోస్టర్ అరాచకంగా ఉంది. ఇక అదే రోజున విజయ్ దళపతి లియో రిలీజ్ కానుంది. ఈ లెక్కన లియోకు గట్టి పోటీ ఎదురుపడ్డట్లే. పైగా ఈ సినిమాను సితార సంస్థ ఏకంగా రూ.21 కోట్ల రేంజ్‌లో హక్కులను కొనుగోలు చేశాడు. సోలోగా రిలీజయ్యుంటే తొలిరోజు పాతిక శాతం అయినా రికవరీ అయ్యేది. ఇక ఇప్పుడు అదే రోజు వస్తుండటంతే లియోకు పెద్ద దెబ్బ పడ్డట్లే. పైగా బాలయ్య క్రేజ్ ఇప్పుడు మాములుగా లేదు. మిక్స్‌డ్‌టాక్ తెచ్చుకున్న వీరసింహా రెడ్డి సినిమానే తొలిరోజు యాభై కోట్ల రేంజ్‌లో కలెక్షన్‌లు కొల్లగొట్టిందంటే.. ఈ సినిమాకు మినిమం పాజిటీక్ టాక్ వచ్చినా వసూళ్ల వర్షం ఖాయం. ఫాదర్ డాటర్ సెంటిమెంట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో శ్రీలీల బాలయ్యకు కూతురుగా కనిపించనుంది. బాలయ్యకు జోడీగా కాజల్ అగర్వాల్ నటిస్తుంది. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను షైన్ స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.





## వీర లెవల్లో బ్రో మూవీ ట్రైలర్..

ఎప్పుడెప్పుడా అని మెగా ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురు చూసిన బ్రో ట్రైలర్ వచ్చేసింది. మెగా అభిమానుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా ట్రైలర్ ఉంది. టీజర్‌తో ఏ స్థాయిలో అంచనాలు పెరిగాయో.. ట్రైలర్ దానికి డబుల్ ఇంపాక్ట్ ఇచ్చేసింది. సరిగ్గా పది రోజులకు ఈ పాటికి బ్రో సినిమాతో థియేటర్‌లు దద్దరిల్లిపోతుంటాయి. టాక్ ఎలా ఉన్నా పవన్ క్రేజ్‌తో తొలిరోజు హంగామా ఎలాగూ ఉంటుంది. ఒకవేళ పాజిటీవ్ టాక్ గనుక వచ్చిందంటే కోట్లు కొల్లగొట్టడం ఖాయం. ఇప్పటికే రిలీజైన టీజర్, పాటలు మెగా అభిమానుల్లో మాములు అంచనాలు క్రియేట్ చేయలేవు. పైగా మామా అల్లుళ్లు కలిసి తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటంతో అందరిలోనూ తిరుగులేని అంచనాలు ఏర్పడ్డాయి. అప్పటికి ఆయన చేయాల్సిన పనులు చాలా ఉంటాయి. అదే టైమ్‌లో పవన్ కళ్యాణ్ దేవుడిగా వచ్చి సాయిధరమ్‌కు ఓ వరం ఇస్తాడు. మరి ఆ వరాన్ని సాయి తేజ్ ఎలా వాడుకున్నాడు. అప్పటివరకు ఇంట్లో వాళ్లకి, ఫ్రెండ్స్‌కు టైమ్ ఇవ్వలేని హీరో.. ఆ ఇన్సిడెంట్ తర్వాత వాళ్లతో ఎలా టైమ్ స్పెండ్ చేశాడు. అతనింకా భూమిపై చేయాల్సిన పనులేమున్నాయి అనే కథనంతో సినిమా ముందుకు సాగుతున్నట్లు ట్రైలర్‌తో ఫుల్ క్లారిటీ వచ్చేసింది. ట్రైలర్ చూస్తుంటే మట్టుకు మెగా ఫ్యాన్స్‌కు మాత్రం పండగే అన్నట్లు ఉంది. ఈలలు వేయించే ఫైట్స్, గోలలు చేయించే కామెడీ పుష్కలంగా ఉండబోతుందని ట్రైలర్ చూస్తే స్పష్టమైంది. పవన్ క్రింజే కామెడీ బాగా వర్కవుట్ అయినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా థమన్ నేపథ్య సంగీతం వేరే లెవల్లో ఉందే. ఇదే స్థాయిలో సినిమా మొత్తం ఉంటే అభిమానులకు అంతకన్నా ఏం కావాలి. పీపుల్ మీడియా సంస్థ కాస్త ఎక్కువగానే ఖర్చు పెట్టినట్లు తెలుస్తుంది. త్రివిక్రమ్ మార్క్ కూడా కనిపిస్తుంది. మొత్తంగా ట్రైలర్ చూస్తుంటే మాత్రం వినోదాల రైడ్‌లా అనిపిస్తుంది. ఇక పవన్ ఎంట్రీ సినిమా స్టార్ట్ అయిన ఇరవై నిమిషాల తర్వాత ఉండబోతుందని ఇప్పటికే లీకైపోయింది. అంతేకాకుండా ఈ సినిమాలో 90 నిమిషాలు పవన్ కనిపించనున్నాడు. అంటే గంటన్నర సేపు పవన్ ఈ సినిమాలో కనిపించబోతున్నాడన్నమాట. నిజానికి ఒరిజినల్ వెర్షన్ సినిమాలో సముద్రఖని పాత్ర అంత సేపు ఉండదు. కానీ ఇక్కడ పవన్ క్రేజ్ దృష్ట్యా ఆయన పాత్రను పెంచినట్లు తెలుస్తుంది. ఫాంటసీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు సముద్రఖని దర్శకత్వం వహించాడు. త్రివిక్రమ్ తెలుగు నేటివిటీకి తగ్గట్లు పలు మార్పులు చేర్పులు చేశాడు. ఈ సినిమా బిజినెస్ వంద కోట్లు దాటిందని సమాచారం.



## బేబీ హీరోయిన్ మిస్ చేసుకుందా?

పదహారేళ్ల నుంచి పాతికేళ్ల పైబడిన ప్రతీ కుర్రాడు ప్రస్తుతం వైష్ణవి మాయలో పడిపోయారు. ఇన్‌స్టా రీల్స్ నుంచి యూట్యూబర్‌గా.. ఆ తర్వాత సినిమాల్లో చిన్న చిన్న రోల్స్‌తో మెప్పించిన వైష్ణవి ఇప్పుడు బేబీతో హీరోయిన్‌గా మారింది. వారం కిందట రిలీజైన బేబీ సినిమా బాక్సాఫీస్ దగ్గర సృష్టిస్తున్న సంచలనాలు అంతా ఇంతా కాదు. ముఖ్యంగా వైష్ణవి పర్‌ఫార్మెన్స్ చూసి అందరూ షాక్ అవుతున్నారు. సినిమా చూసిన ప్రతీ ఒక్కరు వైష్ణవి క్యారెక్టర్‌ను బండ బూతులు తిడుతున్నారు. అంటే నెగెటీవ్ క్యారెక్టర్‌లో వైష్ణవి ఏ లెవల్‌లో పర్‌ఫార్మెన్స్ ఇచ్చిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. డెబ్యూ సినిమాలోనే అన్నన్ని వేరేయేషన్లు చూపించడం మాములు విషయం కాదు. ఒక తెలుగు హీరోయిన్‌కు తొలి సినిమాతోనే ఈ రేంజ్ గుర్తింపు రావడం ఈ మధ్య కాలంలో ఎప్పుడూ చూడలేదు. ఖచ్చితంగా ది బెస్ట్ డెబ్యూ పర్‌ఫార్మెన్స్‌లలో వైష్ణవి చైతన్య నటన ఒకటిగా నిలుస్తుందనడంలో సందేహమే లేదు. బేబీ సినిమా సక్సెస్‌లో సగం క్రెడిట్ ఈమెకే ఇచ్చినా పెద్దగా ఆశ్చర్యపోనక్కర్లేదు. అంతలా తన పాత్రలో జీవించేసింది. ఈ సినిమాతో వైష్ణవి ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. పలు పెద్ద పెద్ద ప్రొడక్షన్ సంస్థల నుంచి వైష్ణవికి ఆఫర్స్ వస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్. ఇక ఇదంతా ఇలా ఉంటే వైష్ణవి ఓ బ్లాక్ బస్టర్ సినిమాను మిస్ చేసుకుందట. అదేంటంటే.. మూడు నెలల ముందు చిన్న సినిమాగా రిలీజై కోట్లు కొల్లగొట్టిన బలగం సినిమా. ఈ సినిమాలో కావ్య రోల్‌ను ముందుగా దర్శకుడు వేణు, వైష్ణవికి ఆఫర్ చేశాడట. కానీ వైష్ణవి పలు కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ చేయలేకపోయిందట. అలా వైష్ణవి బ్లాక్ బస్టర్ సినిమాను మిస్ చేసుకుంది. అయితే ఆ సినిమా చేసుంటే మట్టుకు వైష్ణవికి ఇంత గుర్తింపు మాత్రం ఖచ్చితంగా వచ్చుండేది కాదు.







## గుంటూరు కారం.. స్టార్ టెక్నీషియన్ అవుట్?

అప్పుడెప్పుడో ఏడాదినర్థం క్రితం పూజా కార్యక్రమాలు జరుపుకున్న గుంటూరు కారం ఇప్పటికీ సగం షూటింగ్‌ను కూడా పూర్తి చేసుకోలేదు. ఆది నుంచి ఈ సినిమాకు ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. రెండు షెడ్యూల్స్ తర్వాత ఏకంగా కథనే మార్చారంటే ఇదెక్కడి విడ్డూరం అనిపించింది. ఆ తర్వాత మహేష్‌బాబు ఫ్యామిలీలో విషాదాలు, వెకేషన్‌లు ఇలా చూస్తుండగానే నెలలు నెలలు గడిచిపోయాయి. ఎట్టకేలకు ఈ ఏడాది కలిసొచ్చి నిర్విరామంగా షూటింగ్ జరుతుందనగా మళ్లీ థమన్ తప్పుకున్నాడు, పూజా తప్పుకుందని వార్తలతో మరోసారి గుంటూరు కారం హాట్ టాపిక్ అయిపోయింది. ఇప్పటికే ఈ సినిమా సంక్రాంతికి వస్తుందా లేదా అనే డౌట్.. అంతలో ఇలా ఒక్కొక్కరు తప్పుకుంటే ఇక సంక్రాంతి సంగతి దేవుడికే తెలియాలి అనే విధంగా అయిపోయింది. అయితే ఇటీవలే థమన్ ఈ ప్రాజెక్ట్‌లో ఉన్నట్లు నాగవంశీ క్లారటీ ఇచ్చేశాడు. కానీ పూజా విషయంలో మాత్రం క్లారిటీ లేదు. పూజా కూడా క్రియేటీవ్ డిఫెరెన్సెస్ రావడంతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుందని ఆమె సన్నిహితులు చెప్పారు. ఇక ఇప్పుడు ఆమె ప్లేస్‌ను శ్రీలీల ఆక్యూపై చేసింది. సెకండ్ హీరోయిన్‌గా ప్రాజెక్ట్‌లోకి వచ్చిన శ్రీలీల కాస్త మెయిన్ లీడ్‌గా ఫిక్సయిపోయింది. ఇక శ్రీలీల పాత్ర కాస్త మీనాక్షి చౌదరి చేస్తుంది. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి సినిమాటోగ్రాఫర్ పీ.ఎస్ వినోద్ తప్పుకున్నట్లు తెలుస్తుంది. ఇప్పుడు ఆ ప్లేస్‌లోకి రవి చంద్రన్ వచ్చి చేరాడని ఇన్‌సైడ్ టాక్. ఇలా ఒక్కొక్కరు ఈ సినిమా నుంచి తప్పుకుంటండటంతో మహేష్ ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్నారు. అసలు ఈ సినిమా పూర్తవుతుందా అనే డౌట్‌తో ఉన్నారు. మరో వైపు ఎట్టిపరిస్థుల్లో సంక్రాంతికే సినిమాను దింపాలని చిత్రయూనిట్ కసరత్తులు చేస్తుందట. ఓ వైపు ఇలా స్టార్ కాస్ట్, టెక్నీషియన్స్ తప్పుకుంటూ పోతే.. మరోవైపు షూటింగ్ ఎలా కంప్లీట్ చేస్తున్నారంటూ ట్విట్టర్‌లో పెద్ద చర్చలే జరుగుతున్నాయి. మరీ ఈ తప్పుకోవడాలు ఇక నుంచైనా తగ్గుతాయో లేదో చూడాలి.

## పబ్లిక్ ఫిగర్ నే కానీ.. పబ్లిక్ ప్రాపర్టీని కాదన్న నటి

ఉర్ఫీ జావెద్.. ఈ పేరు తెలియని వారు ఉండరు. మరీ ముఖ్యంగా సోషల్ మీడియాను ఫాలో అయ్యే వారికి సుపరిచితమే. హాట్ హాట్ ఫొటోలతో సోషల్‌మీడియాలో హీట్ పుట్టిస్తుంటుంది. కొత్త కొత్త ఫొటో షూట్స్ తో కుర్రకారు మతిపోగొడుతుంటుంది. ఎవరూ ఊహించని విధంగా వెరైటీ ఔట్‌ఫిట్స్ (దుస్తులు)లో దర్శనమిస్తూ.. ఉర్ఫీ జావెద్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది. తాజాగా ఉర్ఫీకి ఓ చేదు అనుభవం ఎదురైంది. విమాన ప్రయాణ సమయంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆమెను వేధింపులకు గురిచేశాడు. ఈ విషయాన్ని ఉర్ఫీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా వెల్లడించింది. గురువారం రాత్రి వెకేషన్ కోసం ముంబై నుంచి గోవాకు వెళ్లింది. ఆ సమయంలో విమానంలో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి ఉర్ఫీని టీజ్ చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఉర్ఫీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ లో పెట్టింది. 'నిన్న ముంబై నుంచి గోవాకు విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో నేను వేధింపులకు గురయ్యాను. వీడియోలోని వ్యక్తులు నన్ను వేధింపులకు గురి చేశారు. ఈవ్ టీజింగ్ చేశారు. దీంతో నేను వారితో వాదించా. అప్పుడు అతను మద్యం తాగి ఉన్నాడని అతని స్నేహితులు చెప్పారు. తాగి ఉన్నా సరే ఇలా మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడాన్ని క్షమించలేము. నేను పబ్లిక్ ఫిగరే. అయినా, పబ్లిక్ ప్రాపర్టీని మాత్రం కాదు' అంటూ చెప్పుకొచ్చింది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com